శనివారం
21-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 91
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆరు ఉపగ్రహాలు ప్రయోగించిన చైనా

బీజింగ్: చైనా ఆరు ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. షాంగ్జి ప్రావిన్స్‌లోని తైయువాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి శుక్రవారం ఆరు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. లాంగ్ మార్చ్ 2-డి కేరియర్ రాకెట్ ద్వారా జిలిన్-1 కుయాంపు 02బీ 01-06 ఉపగ్రహాలు నిర్దేశిత కక్షకు చేరాయి. మధ్యాహ్నం 12.11 గంటలకు (బీజింగ్ కాలమానం ప్రకారం) ప్రయోగం విజయవంతమైందని,లాంగ్ మార్చ్ రాకెట్ సిరీస్‌కు సంబంధించి ఇది 536వ ఫ్లైట్ మిషన్ అని అధికారులు వెల్లడించారు.

లడ్డూ దుమారం

- మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- సమగ్ర దర్యాప్తు కోసం డిమాండ్లు
- గత ప్రభుత్వ నిర్వాకమేనంటున్న టీడీపీ
- అత్యవసర విచారణకు హైకోర్టులో వైసీపీ పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ ప్రసాదం వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న అనుమానాలున్నాయంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చానీయాంశమయ్యాయి. హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఉన్న ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని... ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, హిందూ ధార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో లడ్డూ వివాదంపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసరంగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమగ్ర వివరాలతో ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మరోపక్క గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్ ఇచ్చిన నివేదికలో జంతువుల కొవ్వు నెయ్యిలో కలిపినట్లుగా తేలిందని టీటీడీ ఈవో శ్యామలరావు మీడియాకు వివరణిచ్చారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో నాణ్యత లేదని నివేదికలు వచ్చినట్లు తెలిపారు. మరోపక్క తిరుపతి లడ్డూ వివాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీబీఐతో విచారణ జరిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షు రాలు షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీ వార్తలు తనను ఎంతో కలచివేశాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఈ విషయంపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడుతో మాట్లాడి పూర్తి నివేదికను కోరినట్లు నడ్డా తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇదే అంశంపై కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు చెప్పిన అంశం చాలా తీవ్రమైనదన్నారు. సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని చెప్పారు. లడ్డూ కల్తీ వ్యవహారం అందరినీ ఆందోళనకు గురి చేసే అంశమని ఇది భక్తుల మనోభావాలకు సంబంధించినదని ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.

ఆల్ఫామిల్క్‌పైనే అనుమానాలు !

గతంలో తిరుమల లడ్డూల తయారీకి కర్నాటక నుంచి సరఫరా అయ్యే నందినీ నెయ్యిని వాడేవారని, వైసీపీ అధికారంలోకి వచ్చాక నందినీ నెయ్యి వాడకం నిలిపేసిందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది జులై 17న గుజరాత్‌లోని సెంటర్-రన్ నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్‌లోని సెంటర్ ఆఫ్ ఎనాలిసిస్ అండ్ లెర్నింగ్ ఇన్ లైవ్‌స్టాక్ అండ్ ఫుడ్(సీఏఎల్ఎఫ్) ల్యాబ్ ఓ నివేదిక విడుదల చేసింది. ప్రసిద్ధ తిరుపతి లడ్డూలను తయారు చేయడానికి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వును కనుగొన్నట్లు తెలిపింది. తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి వివాదంలో ఆల్ఫా మిల్క్ ప్రొడక్ట్స్ పేరు అధికంగా విన్పిస్తోంది. ఈ కంపెనీ అత్యధికంగా

- మిగతా 2 లో

'గగన్‌యాన్' మరో బోయింగ్ కారాదు

ఇస్రో ఛైర్మన్

బెంగళూరు: ప్రతిష్ఠాత్మక తొలి మానవ మిషన్ 'గగన్‌యాన్'ను ఈ ఏడాది చివరిలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించనుంది. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దీంతో గగన్‌యాన్ మిషన్ విజయవంతం కావాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. ఇది మరో బోయింట్ స్టార్‌లైనర్‌గా పరిణమించరాదని ఆయనన్నారు. ఎనిమిది రోజుల కోసం అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది నెలల

- మిగతా 2 లో

కొలీజియం... సెర్చ్ ప్యానల్ కాదు

కేంద్రాన్ని నిలదీసిన సుప్రీం

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాలకు జడ్జిల నియామకాలకు, పదోన్నతకు సంబంధించి కొలీజియం చేసే సిఫార్సులను ఆమోదించడానికి మీకున్న సమస్య ఏమిటంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. కొలీజియం ఏమీ సెర్చ్ ప్యానల్ కాదంటూ అసహనం వ్యక్తంచేసింది. హైకోర్టు న్యాయమూర్తులుగా అర్హులైన వారిని కొలీజియం సిఫార్సు చేయడాన్ని గుర్తుచేస్తూ నియామకాల్లో ఏ మేరకు పురోగతి సాధించారో చెప్పాలని సూచించింది. పెండింగ్ పేర్ల జాబితాను సమర్పించాలని

- మిగతా 2 లో

ఈడీ కేసుల్లో పురోగతి నామమాత్రమే

ఎఫ్ఏటీఎఫ్

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులతో విపక్షాలను మోదీ ప్రభుత్వం బెదిరించేందుకు యత్నిస్తోందని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) విమర్శించింది ప్రతిపక్ష నేతలను మనీలాండరింగ్ కేసుల్లో ఇరికించి వేధిస్తోందని, ఆర్థిక నేరాలు రుజువు కానప్పటికీ విచారణ పేరిట

- మిగతా 2 లో

సుప్రీంకు చేరిన వివాదం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి లడ్డూ వివాదం చిలికి చిలికి గాలివానగా మారుతోంది. ఈ పంచాయతీ ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. సుప్రీంకోర్టు జోక్యాన్ని కోరుతూ ఓ న్యాయవాది సత్యం సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. మతపరమైన హక్కులు, ఆచారాలు, మనోభావాలను కాపాడాలని న్యాయస్థానానికి విన్నవించారు. తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీకి వినియోగమయ్యే నెయ్యిలో పశువుల కొవ్వు ఉందని, దీంతో భక్తుల మతపరమైన మనోభావాలు దెబ్బతినడానికి తోడు హిందూ మత సంప్రదాయాలకు విఘాతం కలుగుతోందని

- మిగతా 2 లో

వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే: వైఎస్ జగన్

సీఎం చంద్రబాబు వ్యాఖ్యల్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుబట్టారు. చంద్రబాబు 100 రోజుల పాలనలో తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని మండిపడ్డారు. దీనిపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి, ప్రధాని మోదీకి లేఖ రాస్తామని వెల్లడించారు. అయితే టీటీడీ లడ్డూ వ్యవహారంపై హైకోర్టులో వైసీపీ అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తరపున వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ ఈ పిటిషన్ వేశారు. దీనిపై జ్యూడిషియల్ విచారణకు ఆదేశించి వాస్తవాలు నిగ్గుతేల్చాలని కోరగా... బుధవారానికి విచారణ వాయిదా పడింది.

అవి రాజ్యాంగ విరుద్ధం

కేంద్రం 'ఫ్యాక్ట్ చెక్'కు చుక్కెదురు

ముంబై: ఆన్‌లైన్ కంటెంట్‌లో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకు ఇటీవల తీసుకువచ్చిన ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ అంశంలో కేంద్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. వీటి ఏర్పాటు కోసం చేపట్టిన ఐటీ నిబంధనల్లో సవరణలు రాజ్యాంగ విరుద్ధమని బాంబే హైకోర్టు పేర్కొంది. వీటిని సవాలు చేసేందుకు పిటిషనర్లకు అనుమతిస్తూ తీర్పు వెలువరించింది. 'ఇందులోని విషయాలను విస్తృతంగా పరిశీలించాను. ఈ నిబంధనలు ఆర్టికల్ 14 (సమానత్వం హక్కు), ఆర్టికల్ 19 (భావప్రకటన స్వేచ్ఛ హక్కు)లను ఉల్లంఘించాయి' అని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్ పేర్కొన్నారు. నిబంధనల్లో పేర్కొన్న 'నకిలీ, తప్పుడు, తప్పుదోవపట్టించే' వంటి అంశాలకు ఎలాంటి నిర్వచనం లేనప్పుడు వాటికి అర్థం లేదన్నారు. ఆన్‌లైన్‌లో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్‌ను తీసుకువస్తామని పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం... ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు గతంలో సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే ఐటీ నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తదితరులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. వీటిపై ఈ ఏడాది జనవరిలో విచారణ జరిపిన బాంబే హైకోర్టు... భిన్న తీర్పు వెలువరించింది.

హైకోర్టు డివిజన్ బెంచ్‌లోని ఓ న్యాయమూర్తి ఈ నిబంధనలను తోసిపుచ్చగా... మరో న్యాయమూర్తి సమర్థించారు. దీంతో ఈ కేసు మూడో న్యాయమూర్తి చేతుల్లోకి వెళ్లింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్... ఐటీ రూల్స్ రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

జగన్ పాలనలో వ్యవస్థలు విధ్వంసం

- తిరుమల లడ్డూ వ్యవహారంతో మత విశ్వాసంపై దెబ్బ
- బుడమేరుకు గండ్లు... బ్యారేజీ పైకి బోట్లు
- హామీలన్నీ అమలు చేస్తాం... విశ్వాసం చూరగొంటాం
- వందరోజుల పండుగలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థలన్నింటిని ధ్వంసం చేశారని, చివరకు మత విశ్వాసాన్ని దెబ్బతీసేలా తిరుపతి లడ్డూలో స్వచ్ఛమైన ఆవునెయ్యికి బదులు కల్తీ నెయ్యి కలిపి దేవుడికే నైవేద్యం పెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో శుక్రవారం 'మన ప్రభుత్వం వందరోజుల పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని చెప్పారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామని అన్నారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌లన్ను పున:ప్రారంభించామని చెప్పారు. పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టే కార్యక్రమాన్ని కూడా గత ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చామని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. రూ.99కే 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను అందిస్తామన్నారు. కేంద్రం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. వన్ నేషన్... వన్ ఎలక్షన్ అని కేంద్రం ప్రకటన చేసిందని, ఇక అన్ని ఎన్నికలు ఒకేసారి వస్తాయని అన్నారు. ఎవరి మతం మీద వారికి విశ్వాసం ఉంటుంది. తిరుపతి మత విశ్వాసాన్ని దెబ్బతీశారు. తక్కువ ధరకు వస్తుందని కల్తీ నెయ్యి తీసుకొచ్చి దేవుడికి నైవేద్యం పెట్టారని అన్నారు. ఆవునెయ్యికి కనీసం రూ.500 ధర ఉంటే 320 తక్కువ ధరకు నెయ్యి తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ప్రసాదాలకు, ఇప్పటి ప్రసాదాలకు ఎంత తేడా ఉందో గమనించాలని ప్రజలను కోరారు. ఇటీవల వరదలు వస్తే బుడమేరుకు గండ్లు పెట్టారని, మూడు బోట్లు కృష్ణానదిలో వదిలేశారని పేర్కొన్నారు. పదిలక్షల క్యూసెక్కుల

- మిగతా 2 లో

మెగాస్టార్ చిరంజీవికి ఏఎన్నార్ అవార్డు

అధికారికంగా ప్రకటించిన నాగార్జున

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈ ఏడాది ఏఎన్ఆర్ అవార్డును మెగాస్టార్ చిరంజీకి ఇవ్వబోతున్నట్లు అక్కినేని నాగార్జున అధికారికంగా ప్రకటించారు. లెజెండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లో 100వ పుట్టినరోజు వేడుకలను అక్కినేని ఫ్యామిలీ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అక్కినేని కుటుంబం మొత్తం హాజరైంది. ఈ ఏడాది ఏఎన్నార్ అవార్డును మెగాస్టార్ చిరంజీవికి అక్టోబర్ 28న బిగ్ బి అమితాబ్ చేతుల మీదుగా ఇవ్వబోతున్నట్లుగా కింగ్ నాగార్జున ప్రకటించారు. అలాగే బాపు గీసిన ఏఎన్నార్ చిత్రాన్ని పోస్టల్ స్టాంప్ రూపంలో విడుదల చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని నాగార్జున తెలిపారు. ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరైన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వావ్, వెరీ గుడ్ న్యూస్

బెంగాల్‌లో భారీ కాగడాల ర్యాలీ

'ఆర్జీ కర్' బాధితురాలికి న్యాయం కోసం డిమాండ్

దోషులను శిక్షించే వరకు విశ్రమించం: నిరసనకారులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని వీధులు నిరసనకారులతో కిక్కిరిశాయి. ఇసుక వేస్తే రాలని చందంగా మారాయి. కాలుతున్న కాగడాలు చేతపట్టి 'ఆర్జీ కర్' బాధితురాలికి న్యాయం కోసం వేలాది మంది కదం తొక్కారు. కోల్‌కతాలోని హైల్యాండ్ పార్కు నుంచి కాగడాల ర్యాలీ జరిగింది. అన్ని వర్గాల వారు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 42 కిమీలు సాగిన ఈ ర్యాలీలో వైద్యులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, దివ్యాంగుల

- మిగతా 2 లో

న్యాయస్థానాలపై నిందలా

సీబీఐకి సుప్రీంకోర్టు అక్షింతలు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని న్యాయస్థానాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. రాష్ట్రంలో ఎన్నికల తర్వాత జరిగిన హింసపై దాఖలైన కేసుల విచారణకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది. ఈ కేసుల విచారణను ఆ రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని సీబీఐ కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ అభయ్, జస్టిస్ అగస్టిన్‌లతో కూడిన బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ఉద్దేశించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బదిలీ పిటిషన్‌ను

- మిగతా 2 లో

కాటేస్తోన్న కల్తీ

కలుషిత ఆహారానికి ఏటా 4,20,000 మరణాలు

60 కోట్ల మందికి అస్వస్థత: డబ్ల్యూహెచ్‌ఓ

2లో

శ్రీలంక అధ్యక్ష పీఠం ఎవరిదో?

త్రిముఖ పోటీ... నేడు ఎన్నికలు

కొలంబో: రెండేళ్ల క్రితం తీవ్ర ఆర్థిక, ఆహార సంక్షోభంతో అతలాకుతలమైన శ్రీలంక... ఆ సవాళ్ల నుంచి ఇప్పుడే బయటపడుతోంది. శనివారం జరిగే అధ్యక్ష ఎన్నికల్లో 1.7 కోట్ల మంది ఓటర్లు పాల్గొననున్నారు. దివాలా అంచున ఉన్న శ్రీలంకను గట్టెక్కించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న రణిల్ విక్రమసింఘే... మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పలువురు విపక్ష నేతలు కూడా తీవ్ర పోటీ ఇస్తున్నారు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల బరిలో 38 మంది అభ్యర్థులు ఉన్నారు. వారిలో ముగ్గురి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘేకు నేషనల్ పీపుల్స్ పవర్ నేత అనుర కుమార దిస్సనాయకే (56), ప్రతిపక్ష నేత, సామగి జన బలవేగాయ పార్టీ నేత సాజిత్ ప్రేమదాస (57) గట్టి పోటీ ఇస్తున్నారు. 1982 నుంచి శ్రీలంక అధ్యక్ష ఎన్నికల చరిత్రలో త్రిముఖ పోటీ నెలకొనడం ఇదే తొలిసారని విశ్లేషకులు చెబుతున్నారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగిపోవడానికి కారణంగా భావించే రాజపక్స కుటుంబం నుంచి నమల్ రాజపక్స బరిలో ఉన్నారు. మహింద కుమారుడు నమల్... మాజీ ఆర్థిక మంత్రి బాసిల్ రాజపక్స స్థాపించిన ఎస్ఎల్‌పీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నప్పటికీ ఆయనకు అంతగా ఆదరణ కనిపించడం లేదు.

ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడిన సమయంలో దేశ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రణిల్ విక్రమసింఘే (75) అనేక సంస్కరణలు చేపట్టారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి నిబంధనలకు లోబడి ఉండటంతో అవి ప్రజాదరణ పొందలేదని చెబుతారు. అయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం కాకుండా చూడటంలో ఆయన చర్యలు దోహదపడినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచార సభలో రణిల్ విక్రమసింఘే మాట్లాడుతూ తాము ప్రవేశపెట్టిన సంస్కరణలతో దేశాన్ని దివాలా అంచు నుంచి కాపాడామని, భవిష్యత్‌లో మరింత సమర్థంగా పనిచేస్తామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అనధికారిక ఒపీనియన్ పోల్స్ ప్రకారం ఈ పోటీలో అనుర కుమార దిస్సనాయకే ముందంజలో ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అవినీతి వ్యతిరేక నినాదాన్ని ప్రధానంగా ప్రస్తావించడం, దీంతో యువత నుంచి భారీ మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. 2020 పార్లమెంటరీ ఎన్నికల్లో ఆయనకు కేవలం మూడుశాతం ఓట్లు వచ్చాయి. విక్రమ సింఘేకు రెండుశాతం, అత్యధికంగా ప్రేమదాసకు 25 శాతం ఓట్లు లభించాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో తాను 20 లక్షల మెజార్టీతో విజయం సాధిస్తానని ప్రేమదాస ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2020 పార్లమెంటరీ ఎన్నికల్లో ఈ ముగ్గురు ముఖ్యనేతలు ఎదురుదెబ్బలు తిన్నవారేనని, అందుకే మునుపటి అధ్యక్ష ఎన్నికల కంటే ఇవి భిన్నమైనవని విశ్లేషకులు చెబుతున్నారు. ఈసారి మైనార్టీ తమిళుల సమస్య ఏ ఒక్కరి ఎన్నికల అజెండాలో లేదన్నారు. ఐఎంఎఫ్ ఉద్దీపన సంస్కరణలకు లోబడి పనిచేస్తామని ముగ్గురు అభ్యర్థులు చెప్పిన విషయాలను గుర్తుచేస్తున్నారు. ఇదిలా ఉంటే, శ్రీలంకలో దాదాపు 1.7 కోట్ల మంది ఓటర్లు నమోదు చేసుకోగా... 13,421 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విక్రమ సింఘే సహా మొత్తం 38 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. ప్రాధాన్యత క్రమంలో ముగ్గురు అభ్యర్థులకు ఓటు వేయడానికి వీలుంది.

హెజ్బుల్లాపై ఇజ్రాయిల్ మెరుపు దాడులు

150 స్థావరాలు, 30 రాకెట్ లాంచర్లు, ఆయుధాగారాలు ధ్వంసం

జెరుసలేం: హెజ్బులా లక్ష్యంగా ఇజ్రాయిల్ మెరుపు దాడులకు పూనుకుంది. ఈ ఏడాదిలోనే అత్యంత తీవ్రస్థాయిలో వైమానిక దాడులకు పాల్పడింది. 30 రాకెట్ లాంచర్లు,150 స్థావరాలను ధ్వంసం చేసింది. ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) అధ్వర్యంలో జరిపిన దాడుల్లో దక్షిణ లెబనాన్‌లోని హెజ్బుల్లాకు చెందిన 150 స్థావరాలు, 30 రాకెట్ లాంచర్లు, మిలటరీ మౌలికవసతులు, భవనాలు, ఆయుధాగారాలను ధ్వంసమయ్యాయి. ఈ మేరకు 'ఎక్స్'లో ఐడీఎఫ్ పేర్కొంది. ఇజ్రాయిల్ వైమానిక దళం ఈ దాడులు చేసినట్లు తెలిపింది. ఘర్షణ మొదలైన తర్వాత ఇంత భారీ స్థాయిలో దాడులు జరగలేదు. ఇజ్రాయిల్‌పై దాడికి హెజ్బుల్లా సిద్ధంగా ఉంచిన వెయ్యి బారళ్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయిల్ వాసులను బయట తిరగవద్దని, గ్రామ ద్వారాలను భద్రపర్చుకోవాలని, రక్షిత

ప్రాంతాల్లోనే ఉండాలని కూడా తొలిసారి ఆదేశాలు జారీ అయ్యాయి. మెరం గాలిల్, అప్పర్ గలిలీ, మెవోట్ హెర్మన్, యెసోద్ హమాలా, హజర్, రోష్ పినా, సఫెద్, మెటులా ప్రాంతాలతో పాటు ఉత్తర గోలాన్ పర్గీయులకు ఈ మేరకు ఉత్తర్వులను ఇజ్రాయిల్ జారీచేసింది. లెబనాన్‌లో మారణహోమానికి యత్నించిన ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని హెజ్బులా నాయకుడు హసన్ నస్రల్లా హెచ్చరించిన కొద్దిసేపటికీ ఇజ్రాయిల్ మెరుపుదాడులు జరిగాయి. ఇజ్రాయిల్ 'లక్ష్మణ రేఖ' దాటిందంటూ నస్రల్లా మాట్లాడుతుండగానే ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బీరుట్‌లోకి దూసుకెళ్లాయి. లెబనాన్ దాడులతో తమ పోరాటం మరో దశకు చేరుకుందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లట్ ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పటివరకు గాజాకే పరిమితమైన వైమానిక, క్షిపణి దాడులు ఇక లెబనాన్‌కు విస్తరించాయని చెప్పారు.

ఇజ్రాయిల్ ఉత్తర వర్గాలు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవడమే తమ ఉద్దేశమన్నారు. కాలం గడుస్తున్నాకొద్దీ పోరు తీవ్రతరం అవుతుందని, హెజ్బుల్లా మరింత భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు లెబనాన్‌లో ఉన్న అమెరికన్లు దేశం వీడాలంటూ బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సూచించింది.

వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్ర కమాండర్ హతం: ఇజ్రాయిల్

టెల్ అవీవ్: ఇజ్రాయిల్‌కు చెందిన వాయుసేన జరిపిన దాడిలో వెస్ట్‌బ్యాంక్‌లోని క్వాబాటియా నగరంలో కీలక ఉగ్ర కమాండర్ హతమయ్యాడు. ఈ విషయాన్ని ఐడీఫ్ ప్రకటించింది. జెనిన్ సమీపంలోని క్వాబాటియా వద్ద జరిగిన కాల్పుల్లో నలుగురు గన్‌మెన్‌లను మట్టుబెట్టారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికి మరికొంత మంది ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు మొదలు పెట్టారు. దీంతో ఐడీఎఫ్ దళాలు డ్రోన్ల సాయంతో ఇక్కడ బాంబింగ్ చేశాయి. ఈ ఘటనలో ఓ కారును కూడా పేల్చి వేశారు. దానిలో భారీగా ఆయుధాలు, మందుగుండు ఉండటంతో అవి ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో మరణించిన వారిలో క్వాబాటియాలో ఉగ్రనెట్‌వర్క్ కమాండర్ షాదీ జక్రానేహ్ ఉన్నట్లు తేలింది.

అతడు ఉత్తర వెస్ట్‌బ్యాంక్‌లో చాలా దాడులకు కారణమని తేలింది. మరో ఏడుగురు మోస్ట్‌వాంటెడ్ వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపింది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయిల్ విమానాలు ఎడతెరిపి లేకుండా దాడులు కొనసాగిస్తున్నాయి. రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో ఏకంగా 100 రాకెట్ లాంఛర్లను ధ్వంసం చేశాయి.

మెగాస్టార్ చిరంజీవికి ఏఎన్నార్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ 'మా నాన్న అంటే మాకు ఎంతో ప్రేమ. నాన్న మాకు నవ్వుతూ జీవించటం నేర్పించారు. ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చాలాదూరం నుంచి విజయ చాముండేశ్వరి వంటి వారెందరో వచ్చారు. వారందరికీ థ్యాంక్స్. 31 సిటీస్‌లో 60కి పైగా థియేటర్ల లో నాన్న సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఈ సినిమాలన్నింటినీ ఉచి తంగా చూడవచ్చు. ఈ వేదికపై నాన్న స్టాంప్ రిలీజ్ చేసినందుకు ధన్యవాదాలు. నాన్న అభిమానులు శతజయంతిని చాలాగొప్పగా జరుపుకున్నారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ బాపు గీసిన చిత్రాన్ని పోస్టల్ స్టాంప్ రూపంలో విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ 'నేను చిన్నప్పటి నుంచి అక్కినేని అభిమానిని. అలాంటిది ఆయన పక్కన నటించే అవకాశం నాకు లభించింది. అన్నపూర్ణ స్టూడియోస్‌పై తెరకెక్కిన మొదటి సినిమాలో నేనే హీరో. ఇండస్ట్రీలో శ్రీరామచంద్రుడు నేనే అని అక్కినేని సర్టిఫికెట్ ఇచ్చారు. అంతకంటే ఇంకేం కావాలి. హైదరాబాద్‌లో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసిన తొలి వ్యక్తి అక్కినేని' అని చెప్పారు.

న్యాయస్థానాలపై నిందలా

(మొదటిపేజీ తరువాయి)

వాపస్ తీసుకోవాలని సూచించింది. 'మిస్టర్ రాజు... బెంగాల్‌లోని అన్ని కోర్టులు ఘర్షణ వాతావరణంలో ఉన్నాయని, మీరు ఎటువంటి ఆధారాలు ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు. అక్రమంగా బెయిళ్లు ఇస్తున్నాయని ఆరోపణలు చేశారు. న్యాయ వ్యవస్థ మొత్తం ఘర్షణ వాతావరణంలో పని చేస్తోందనేలా పిటిషన్ ఉంది' అని జస్టిస్ అభయ్ వ్యాఖ్యానించినట్లు లైవ్‌లా వెబ్‌సైట్ పేర్కొంది. ఏఎస్‌జీ దీనిపై స్పందిస్తూ... పిటిషన్ రాతలో కొంత లోపం ఉన్నట్లు అంగీకరించారు. దానిని సవరించేందుకు అంగీకరించారు. తమకు న్యాయస్థానాలను తప్పుపట్టే ఉద్దేశం లేదని వివరించారు. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ధర్మాసనం సూచించింది. ఈ పిటిషన్‌ను గతేడాది జూన్‌లో సుప్రీంకోర్టులో సీబీఐ దాఖలు చేసింది. అల్లర్ల కేసులోని సాక్షుల భద్రత, బెదిరింపులు వంటి అంశాలను ప్రస్తావించింది.

'గగన్‌యాన్' మరో బోయింగ్ కారాదు

(మొదటిపేజీ తరువాయి)

కోసం అక్కడే చిక్కుకుపోయిన వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రయాణించిన వ్యోమనౌకనుద్దేశించి ఆయన ఈ వ్యాఖ్య చేశారు. శుక్రగ్రహాన్ని అన్వేషించడానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడిందని చెప్పారు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు అంతరిక్ష ప్రాజెక్టుల్లో వీనస్ ఆర్బిటర్ మిషన్ (వోమ్) ఒకటి. 'భవిష్యత్‌లో భూగ్రహం కొన్ని కారణాలతో జీవించడానికి అనువుగా ఉండకపోవచ్చు. మార్స్, వీనస్ వంటి గ్రహాల పరిస్థితులను అధ్యయనం చేయకపోతే భవిష్యత్ తరాలు ఇబ్బంది పడతాయి. భారత్ ఇప్పటికే అంగారకుడు (మార్స్)పైకి వెళ్లింది. జాబిల్లిని చేరుకున్నది. ఇక శుక్ర గ్రహం (వీనస్) అన్వేషణ కీలకం. తర్వాతి తరం ప్రయోగ వాహనం (ఎన్‌జీఎల్‌వీ) తయారీకి కనీసం ఏడేళ్లు పడుతుంది. 2028, మార్చిలో వీనస్ మిషన్‌ను చేపట్టాలని ఇస్రో లక్ష్యం పెట్టుకుంది. ప్రస్తుతమున్న వాహనాల ద్వారానే ఈ ప్రయోగం జరుగుతుంది. భావిష్యత్ కార్యకలాపాలకు అనువైన ప్రయోగ వాహనాన్ని ఇస్రో తయారు చేస్తోంది. 2030 నాటికి శుక్ర గ్రహాన్ని చేరుకోవాలని రష్యా, చైనా, జపాన్ కూడా మిషన్లు చేపట్టాయి. లాంచ్ వెహికల్ మార్క్-3 (ఎల్‌వీఎం3) నుంచి వీనస్ మిషన్ ప్రయోగించాలని నిర్ణయించాం' అని సోమనాథ్ వెల్లడించారు. భూగ్రహానికి దగ్గరగా ఉన్న గ్రహం కాబట్టి శుక్రుడిని చేరుకోవడం పెద్ద సవాల్‌గా ఉందన్నారు. శుక్రుడిపై వాతావరణంలో భూమి కంటే 100శాతం ఎక్కువ పీడనతో కూడుకొని ఉంటుందన్నారు. మార్స్ ఆర్బిటర్ మిషన్ తర్వాత చేపట్టబోయే రెండవ ఇంటర్‌ప్లానటరీ మిషన్‌గా వీనస్ మిషన్ ఉండనుంది. స్పేస్ ఎక్స్‌పోకు పెరిగిన ఆదరణపై సోమనాథ్ హర్షం వ్యక్తంచేశారు. స్టార్టప్‌లు సొంతంగా ఉపగ్రహాలు తయారు చేస్తుండటం స్వాగతించదగ్గ పరిణామమని ఇస్రో చైర్మన్ అన్నారు.

రాష్ట్రంలో రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్ల అభివృద్ధి : మంత్రి కందుల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ప్రతిపాదించారు. విజయవాడలోని నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్-వియత్నాం టూరిజం కాన్క్లేవ్-2024 నిర్వహించారు. 200 మందికి పైగా పర్యాటక ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా మంత్రి కందుల... వియత్నాం తరపున ముఖ్య అతిథిగా హెచ్.ఈ. ఎంగ్యూయేన్ థాన్హయ్ హాజరయ్యారు. ఐరా ఓవర్సీస్ స్టడీస్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, వియత్నాం మధ్య పర్యాటక, కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కు మరింత బలం చేకూర్చే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

బెంగాల్‌లో భారీ కాగడాల ర్యాలీ

(మొదటిపేజీ తరువాయి)

సంఘాలు, కార్టూనిస్టులు, ఐటీ వృత్తిదారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, ప్రత్యర్థి ఫుట్‌బాల్ క్లబ్బులైన మోహన్ బగన్, ఈస్ట్ బెంగాల్ సభ్యులు పాల్గొన్నారు. బాధిత వైద్యురాలికి మద్దతుగా నినాదాలు మార్మోగాయి. రూబీ క్రాసింగ్, వీఐపీ బజార్, సైన్స్ సిటీ, ఛింగ్రిఘటా మీదగా బెలెఘటా, ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజి, ఛిత్తరంజన్ నేషనల్ మెడికల్ కాలేజి, మలిక్ బజార్, ఎస్ఎస్‌కేఎం హాస్పిటల్ మార్గంలో సాగిన కాగడాల ప్రదర్శన శ్యామ్ బజార్ వద్ద ముగిసింది. 'మా న్యాయ పోరాటం ముగిసినట్లు కాదు' అని నిరసనకారులు స్పష్టంచేశారు. మా సోదరిపై ఘాతుకానికి ఒడిగట్టిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించేంత వరకు విశ్రమించేది లేదు' అని అన్నారు.

నేటి నుంచి పాక్షికంగా విధుల్లోకి...

కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి నిరసనలకు దిగిన వైద్య విద్యార్థులు ఎట్టకేలకు 41 రోజుల తర్వాత తమ ఆందోళన విరమించారు. శనివారం నుంచి అత్యవసర సేవల్లో పాల్గొంటామని వారు ప్రకటించారు. ప్రభుత్వంతో జరిపిన రెండో దఫా చర్చల అనంతరం వైద్య విద్యార్థులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల క్రితం సీఎం మమతా బెనర్జీ నివాసంలో జూనియర్ వైద్యులు సమావేశమైన సందర్భంగా వారు చేసిన వివిధ డిమాండ్లకు మమత బెనర్జీ అంగీకరించారు. కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌ను బదిలీ చేశారు. నూతన కమిషనర్‌గా మనోజ్ కుమార్ వర్మను నియమించారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కౌస్తవ్ నాయక్, హెల్ సర్వీస్ డైరెక్టర్ దేవాశిష్ హల్దేర్‌లను వారి పోస్టుల నుంచి తొలిగించనున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌తో వైద్య విద్యార్థులు సమావేశమయ్యారు. కాగా తమ డిమాండ్లలో అధిక శాతానికి పశ్చిమబెంగాల్

ప్రభుత్వం ఆమోదం తెలపడంతో శనివారం నుంచి పాక్షికంగా విధులకు హాజరుకావాలని జూనియర్ వైద్యులు నిర్ణయించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అత్యవసర, తప్పనిసరి సేవల విభాగాల్లో మాత్రమే తాము విధుల్లో పాల్గొంటామని ప్రకటించారు. అవుట్ పేషంట్ విభాగాల్లో మాత్రం విధులు చేపట్టబోమని స్పష్టం చేశారు. అయితే కోల్‌కతాలోని స్వాస్థ్య భవన్ ఎదుట నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాన్ని శుక్రవారం ఎత్తేస్తామని తెలిపారు. కానీ దానికి ముందు నగరంలో ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చేందుకు బెంగాల్ ప్రభుత్వానికి వారం రోజుల సమయం ఇస్తామని, అప్పటికీ అమలుకాకపోతే తిరిగి విధులను బహిష్కస్తామని హెచ్చరించారు.

కొలీజియం...సెర్చ్ ప్యానల్ కాదు

(మొదటిపేజీ తరువాయి)

సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. 'కొలీజియం సిఫార్సు చేసిన పేర్లు ఆమోదించడానికి మీకున్న సమస్య ఏమిటో చెప్పండి. ప్రతిపాదిత జడ్జిల విషయంలో సాధించిన పురోగతి ఎంత' అని ప్రశ్నించింది. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ జోక్యం చేసుకొని కొలీజియం సిఫార్సులపై కేంద్రం నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితి ఉండాలన్నారు. నిర్దేశిత కాలంలోగా ఆమోదం తెలపని పక్షంలో కొలీజియం సిఫార్సులకు అంగీకరించినట్లుగా భావించేందుకు నిబంధన ఉండాలన్నారు. దీంతో సీజేఐ స్పందిస్తూ పెండింగ్ సిఫార్సులపై వివరాలు ఇవ్వాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి సూచించారు. న్యాయవాది హర్ష్ విభోరె సిఘల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తాజాగా విచారించింది. కొలీజియం సిఫార్సు చేసిన జడ్జిల నియామకానికి కాలపరిమితిని నిర్దేశించాలని పిటిషనర్ కోరారు. ఇదిలావుంటే, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావు నియామకానికి కొలీజియం చేసిన సిఫార్సుకు ఆమోదం తెలపకుండా కేంద్రం పెండింగ్ పెట్టడాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాలంటూ జార్ఖండ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేరొక పిటిషన్ దాఖలు చేసింది. దీనినీ న్యాయస్థానం విచారించింది. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ జార్ఖండ్ తరపున వాదనలు వినిపించారు. ఒడిశా హైకోర్టు జడ్జి బీఆర్ సారంగిని జార్ఖండ్ సీజేగా నియమించాలన్న కొలీజియం సిఫార్సు చేయగా సారంగి పదవీ విరమణకు కేవలం 15రోజుల ముందుగా కేంద్రం ఆమోదించింది. ఇది సరైనది కాదు' అని సిబల్ అన్నారు. ఈ వ్యవహారంలో కోర్టు ఎంత వరకు జోక్యం చేసుకోగలదంటూ అటార్నీ జనరల్ వెంకటరమణి సందేహం వ్యక్తం చేయగా సీజేఐ జోక్యం చేసుకొని ఆ నియామకాలకు ఇప్పటివరకు ఎందుకు జరగలేదో మీరు వివరించండి అని అన్నారు. హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల నియామకాలపై ఈ వారం ఆరంభంలో సుప్రీంకోర్టు కొలీజియం కొత్తగా తీర్మానించింది. జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ (దిల్లీ హైకోర్టు), జస్టిస్ జీఎస్ సంధావాలియా (పంజాబ్ & హర్యానా హైకోర్టు), జస్టిస్ తాషి రబస్తాన్ (జమ్మూకశ్మీర్, లడాఖ్ హైకోర్టు) విషయంలో చేసిన సిఫార్సులలో కొన్ని మార్పులను కొలీజియం చేసింది.

సుప్రీంకు చేరిన వివాదం

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌లో న్యాయవాది పేర్కొన్నారు. ఆలయ నిర్వహణలో లొసుగులకు తాజా పరిణామం అద్దం పడుతోందన్నారు. హిందువుల పరంపరను కాపాడాలని కోరారు. తిరుపతి వెంకటేశ్వర ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యిలో పశుకొవ్వు ఉన్నదంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివాదానికి తెరతీశారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇందుకు నిందించారు. లడ్డూ తయారీకి వాడే నూనెలో బీఫ్ టాలో, మత్స్యనూనె, పంది కొవ్వు ఉన్నట్లు గుజరాత్ ల్యాబ్ నివేదిక ఇచ్చినట్లు ఏపీ ప్రభుత్వం పేర్కొంది. దీంతో న్యాయవాది సత్యం సింగ్ ఓ లేఖ ద్వారా సీజేఐ డీవై చంద్రచూడ్‌కు ఈ విషయాన్ని ఫిర్యాదు చేశారు. పశువుల కొవ్వుతో కూడిన నెయ్యిని టీటీడీ ఆలయ ప్రసాదం తయారీకి వాడటం ద్వారా రాజ్యాంగంలోని అధికరణ 25 ఉల్లంఘనకు గురైందని సీజేఐ దృష్టికి తీసుకెళ్లారు. మత ఆచారాలు, మనోభావాల పరిరక్షణకు సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన అనేక తీర్పులను ప్రస్తావించారు. ఆలయ నిర్వహణలో అనేక లోటుపాట్లు ఉన్నాయనేందుకు తాజా ఘటనే ఉదాహరణ అంటూ న్యాయవాది పేర్కొన్నారు. హిందువుల మత ఆచారాలను కాపాడాలని, ఆలయాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని, లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని పిటిషనర్ కోరారు. ఇదిలావుంటే, లడ్డూ వివాదంపై ఏపీ సీఎం నుంచి సమగ్ర నివేదికను కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కోరారు.

లడ్డూ దుమారం

(మొదటిపేజీ తరువాయి)

టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోంది. అతి తక్కువ ధరలకు కాంట్రాక్టులను దక్కించుకుందనే ఆరోపణలున్నాయి. వైసీపీ అధికారంలో ఉండగా...టీటీడీకి అధికంగా ఈ కంపెనీ నెయ్యి సరఫరా చేసినట్లు తెలిసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన టెండర్లలో కేజీ నెయ్యి రూ. 610కిగాను రివర్స్ టెండర్లలో రూ. 424కి మాత్రమే సరఫరా చేస్తామని ఆ కంపెనీ అంగీకరించింది. కిలోకు రూ.190కిపైగా తగ్గింపు ఇచ్చి టెండర్లు పొందినట్లుగా ప్రచారముంది. ఆల్ఫా కంపెనీ చుట్టూ వివాదం అల్లుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించడంతో లడ్డూల నాణ్యత దెబ్బతిందని టీడీపీ ఆరోపిస్తోంది. నెయ్యిని అపవిత్రం చేయడంలో ఆల్ఫా కంపెనీ ప్రమేయం ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ లడ్డూ తయారీకిగాను నెలకు 42 వేల కిలోల నెయ్యి, 22 వేల 500 కిలోల జీడిపప్పు, 15 వేల కిలోల ఎండుద్రాక్ష, 6వేల కిలోల యాలకులు, శనగపిండి, చక్కెర తదితర పదార్థాలను కొనుగోలుచేస్తోంది.

కుటుంబ సభ్యులతో సహా ప్రమాణానికి సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి

వెంకటేశ్వర స్వామిపై అత్యంత నమ్మకం ఉన్న హిందువుగా, తన హయాంలో టీటీడీలో ఎలాంటి అపచారాలు, అక్రమాలు, నీచమైన కార్యక్రమాలు జరగలేదని, ఆ స్వామి వారి పాదాల చెంత కుటుంబ సభ్యులతో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు.

తాను మోపిన నిందకు చంద్రబాబు కట్టుబడి ఉంటే స్వామివారి పాదాల చెంత ప్రమాణానికి ముందుకు రావాలని స్పష్టం చేశారు. లేదంటే భక్తుల మనోభావాలను దెబ్బ తీసినందుకు కచ్చితంగా చట్టపరమైన చర్యల దిశగా పోరాటం చేస్తామని, ఆయనపై పరువు నష్టం దావా వేస్తామన్నారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు.

ఈడీ కేసుల్లో పురోగతి నామమాత్రమే

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బంది పెడుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో భారత్‌లో ఈడీ తీరును పారిస్‌కు చెందిన ఎఫ్ఏటీఎఫ్ విమర్శించింది. ఈడీ చేపట్టే కేసుల్లో పురోగతి నామమాత్రమేనని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా మనీలాండరింగ్ ఉగ్ర ఆర్థిక వ్యవహారాలను పరిశీలించే ఈ సంస్థ తాజాగా 2019-23లో భారత్‌లో ఈడీ రూ.16,497 కోట్లు జప్తు చేసినట్లు తెలిపింది. ఈ ఐదేళ్లలో నేరారోపణల ఆధారంగా జప్తుచేసిన వాటి విలువ రూ.39 కోట్లుగా నివేదించింది. 4,163 దర్యాప్తులను ప్రారంభించి, వాటిలో 28 కేసుల్లో మాత్రమే దోషులను తేల్చిందని, 132 కేసుల తదుపరి విచారణ అక్కర్లేదని ఈడీ భావించినట్లు ఎఫ్ఏటీఎఫ్ నివేదిక పేర్కొంది. 'నేరారోపణల రేటును పెంచడానికి పెండింగ్ ప్రాసిక్యూషన్‌లను త్వరితగతిన ముగించాలి. సకాలంలో విచారణను కొనసాగించాలి. దీనికి ఈడీ, ప్రత్యేక కోర్టులకు వనరులు మెరుగుపరుచుకోవాలి' అని భారత్‌కు ఎఫ్ఏటీఎఫ్ సూచించింది.

కాటేస్తోన్న కల్తీ

న్యూదిల్లీ: ఆహార కల్తీ పెరిగిపోయి ఆరోగ్య సమస్యలు అధికమయ్యాయి. ఏటా నాలుగు లక్షల మంది కలుషిత ఆహారానికి బలవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. సుమారు 60 కోట్ల మంది కల్తీ ఆహారం తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపింది. కల్తీ, పౌష్టికాహార లోపం వంటి కారణాలతో ఐదేళ్లలోపు చిన్నారులు మృత్యుఒడికి చేరుకుంటున్నారని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రియేసెస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని కోరారు. దిల్లీలో జరిగిన రెండవ అంతర్జాతీయ ఆహార రెగ్యులేటర్ల సదస్సులో టెడ్రోస్ వీడియో సందేశమిచ్చారు. కలుషిత ఆహారం కారణంగా 60 కోట్ల మంది అస్వస్థతకు గురవుతున్నారని, ఏటా 4,20,000 మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వాతావరణ మార్పు, జనాభా వృద్ధి, కొత్త సాంకేతికతలు, ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ వంటివి ఇందుకు దోహదమవుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఆహార వ్యవస్థకు సవాళ్లు పెరుగుతున్నాయని హెచ్చరించారు. కల్తీ ఆహారం కారణంగా సంభవించే మరణాల్లో 70శాతం మేర ఐదేళ్లలోపు చిన్నారులవి కావడం కలచివేస్తోందన్నారు. అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి ఆహార రెగ్యులేటర్ వర్గం పాత్ర కీలకమని టెడ్రోస్ అన్నారు. 30 లక్షల మంది పౌష్టికాహారానికి నోచుకోవడంలేదని తెలిపారు. ఆహార వ్యవస్థలు సరిహద్దులు, ఖండాలు దాటుతున్నాయి. రక్షిత ఆహారం పొందడం ప్రతి ఒక్కరి హక్కు. ఇందుకోసం సమష్టిగా కృషి చేయడం అవసరమని టెడ్రోస్ పిలుపునిచ్చారు.

వ్యవస్థలు విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

వేగంతో వచ్చి అవి గేట్‌లను కొడితే ఏమవుతుందని ప్రశ్నించారు. ఇలాంటి నాయకులు బాబాయిని చంపి ప్రజలను పక్కదారి మళ్లించి 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారని పునరుద్ఘాటించారు. ముంబై నుంచి ఒక యాక్టర్‌ను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేసింది జగన్మోహన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. చట్టాన్ని ఇష్టమొచ్చినట్లు వాడుకున్నారని ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. ఎవరి దగ్గర నుంచి పరిపాలన నేర్చుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. రాబోయే రోజుల్లో ఏపీని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చి దిద్దుతానని స్పష్టం చేశారు. దీపావళి నాటికి ఆడ బిడ్డలకు ఉచిత గ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. విజయవాడలో వరద ముంపునకు సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని పిలుపునిస్తే రూ.350 కోట్లు దాతలు ఇచ్చారని వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులకు కూడా లెక్కా పత్రం లేకుండా పక్కదారి మళ్లించారని ఆరోపించారు. అన్ని రంగాలను భ్రష్టు పట్టించారన్నారు. కేంద్ర ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో నీళ్లు ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. త్వరలో 26 జిల్లాలో ఇంటింటికి నీరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత ముఖ్యమంత్రి జగ్జీవన్ మిషన్‌ను కూడా విధ్వంసం చేశారని, ఆయన చేసిన పనులన్నింటిని ప్రజలకు వినతిపత్రాల ద్వారా విడుదల చేస్తున్నామని తెలిపారు. గడిచిన వంద రోజుల్లో మంచి ప్రభుత్వంగా మంచి పేరు తెచ్చుకున్నామని, ముమ్ముందు ఇలాగే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మద్దిరాలపాడులో పేదల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ పాల్గొన్నారు.

ప్రకాశం, బాపట్ల జిల్లాల నేతలతో జగన్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన నేతలతో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. తాజా రాజకీయ పరిస్థితులు, జిల్లా అధ్యక్షుల ఎంపికపై వారితో చర్చించారు. గురువారం పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వైసీపీ నేతలతో జగన్ వరుస భేటీలు నిర్వహించారు. ఆయా జిల్లాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణ విషయాలపై చర్చించారు. వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా తమ్మినేని సీతారామ్, విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యంజిల్లా అధ్యక్షుడిగా శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్‌ను నియమించారు.

కీచక సంక్షేమ అధికారిపై కఠిన చర్యలు

ఏలూరులో వామపక్ష నేతల ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక సంక్షేమ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఏలూరు అమీనా పేట ప్రైవేటు వసతి గృహంలోని విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వార్డెన్ భర్త శశి కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, కాంగ్రెస్, పౌరహక్కుల సంఘం మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం నేతలంతా వసతి గృహాన్ని పరిశీలించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ అమీనాపేటలో దయానంద సరస్వతి, ఎయిమ్ అండ్ సేవ పేరుతో 50 మంది ఆడ పిల్లలతో వసతి గృహం నడుపుతూ లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఏలూరు జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలోనే ఉన్నా కూడా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. శశికుమార్ ఆకృత్యాలకు అడ్డు లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. శశి కుమార్ పై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించి వారి చదువులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అనుమతుల్లేకుండా దాదాపు రెండేళ్లుగా ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నా... ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. చైల్డ్ అండ్ ఉమెన్ ప్రొటెక్షన్ శాఖ,విద్యాశాఖ, పోలీస్ శాఖ, తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా శశికుమార్‌ను అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఏలూరులో అనుమతుల్లేకుండా ప్రైవేటు వసతి గృహాన్ని నడుపుతూ...విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన శశి కుమార్ ను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ అంశంపై విద్యా శాఖ మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థినులపై అకృత్యాలకు పాల్పడిన వార్డెన్ మణిశ్రీ ఆమె భర్త శశి కుమార్‌ను,అతనికి సహకరించిన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శ్రీమన్నారాయణ మాట్లాడుతూ దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థినులపై అకృత్యాలకు పాల్పడిన వార్డెన్ భర్త శశి కుమార్ ను తక్షణం పోక్సో చట్టం ప్రకారం శిక్షించాలని, ప్రభుత్వం విద్యార్థినులకు రక్షణ కల్పించి తగు న్యాయం చేయాలని కోరారు.ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేముల మల్లిక మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ,అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగం అచ్యుత్, శాయన అభిలాష్ కుమార్, నగర కార్యదర్శి కె రామాంజనేయులు, నగర కమిటీ నాయకులు వీవీవీఎస్ ప్రసాద్, పీడీఎస్‌యూ నాయకులు కాకి నాని, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువ రైతు ఆత్మహత్య బాధ్యత ప్రభుత్వానిదే

రూ.10 లక్షలు పరిహారమివ్వాలి: అజయ్ బాబు, లక్ష్మీరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-ఆదోని రూరల్: అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్యనే శరణ్యంగా భావించారు. పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ హృదయవిదారక ఘటన కర్నూలు జిల్లా, ఆదోని మండలంలోని నాగలాపురం గ్రామంలో జరిగింది. ఆత్మహత్య చేసుకున్న రైతు ఈడిగ నరసింహులు కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు, ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కల్లు భావిరాజు తదితరులు పరామర్శించారు. ఏరియా ఆసుపత్రి మార్చురిలో ఉన్న నరసింహులు మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం నుంచి డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పూట గడవడక దిక్కుతోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పాలకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈడిగ నరసింహులు కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, పిల్లల చదువుల ఖర్చులనూ ప్రభుత్వమే భరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాయలసీమను అభివృద్ధి చేస్తాం: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర- చిత్తూరు: ప్రజా సంక్షేమ ప్రభుత్వమే ప్రభుత్వ ధ్యేయమని, రాయలసీమ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆయన శుక్రవారం బంగారుపాళ్యం మండలం ఎన్. కోటూరులో ప్రజావేదిక నిర్వహించారు. 'బంగారుపాళ్యాన్ని ఎప్పటికీ మర్చిపోను. నాడు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం. డయాలసిస్ సెంటర్ కావాలన్న ప్రజల కోరికను వంద రోజుల్లో తీర్చాం. ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఇందుకోసం రూ.3 కోట్లు ఖర్చు పెట్టాం' అని లోకేశ్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఆయనది బూటకపు ప్రచారమని విమర్శించారు. విజయవాడకు వచ్చిన వరదల్లో చంద్రబాబు జేసీబీలు ఎక్కి ప్రజలను ఆదుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచామని చెప్పారు. మిషన్ రాయలసీమతో ఈ ప్రాంతాభివృద్ధికి సంకల్పించినట్లు తెలిపారు. తిరుమల లడ్డూలో నాణ్యత లేకుండా గత ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. టీటీడీ ప్రక్షాళనకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాదు... ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామని లోకేశ్ హామీనిచ్చారు. ముఖాముఖిలో భాగంగా ప్రజల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్నాథరెడ్డి, కిశర్ కుమార్ రెడ్డి, థామస్, పులివర్తి నాని, భానుప్రకాశ్, గురజాల జగన్‌మోహన్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు సీఎంకు పట్టవా?

ఏఐఎస్ఎఫ్ నేతలు జాన్సన్ బాబు, శివారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం నిరశన దీక్షలు చేప ట్టారు. ప్రముఖ న్యాయవాది ప్రస్తుత రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ దీక్షల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, గురుకులాలు, కస్తూర్బా హాస్టల్ విద్యార్థుల సమస్యలపై సీఎం తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేయాలని స్థానిక కలెక్టర్‌కి, సంక్షేమశాఖ అధికారికి విన్నవించినా పరిష్కరించక పోవడం బాధాకరం అన్నారు. గత ఆరు నెలల నుండి విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో వార్డెన్, కుక్, వాచ్‌మన్, అటెండర్ తదితర పోస్టులు దాదాపు 15,000 ఖాళీగా ఉన్నాయని.. వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు ట్రంకు పెట్టెలు,దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు గత ఆరు సంవత్సరాల నుంచి రాలేదన్నారు. చాలా హాస్టళ్లు శిథిలావస్థకి చేరుకున్నాయని... వాటికి మరమ్మతులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. బాలికల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ ఇవ్వాలని, వారి రక్షణకు ప్రతి హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలను 2500 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వం ఎందుకు చొరవ తీసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనైనా సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు నిధులు కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థుల్ని సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షను ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. నిరశన దీక్షలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి , నాసర్‌జీ, సహాయ కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, షాబీర్ బాషా, రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, నవీన్, సోమన్న, వెంకటేష్ ,సుందర్ ,రాజశేఖర్,పవన్ కిషోర్, సాదిక్, విజయవాడ నగర అధ్యక్ష , కార్యదర్శులు రంజిత్, జగదీశ్ వివిధ జిల్లాల సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె ముచ్చట తీర్చిన పవన్ కల్యాణ్

కానుకగా లేపాక్షి కళాకృతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన కుమార్తె ఆద్య ముచ్చట తీర్చారు. లేపాక్షి సంస్థ ప్రదర్శించిన కళాకృతులను శుక్రవారం వీరు తిలకించారు. అందులో కలంకారీ వస్త్రంతో చేసిన బ్యాగ్, కొయ్య బొమ్మలు చూసి ఆద్య ముచ్చటపడ్డారు. కూతురి ఆసక్తిని గమనించిన పవన్.. వెంటనే ఆ కళాకృతులను కొనుగోలు చేశారు. వివిధ రకాల బ్యాగ్, బొమ్మలు కొనుగోలు చేసి తన కుమార్తెకు కానుకగా ఇచ్చారు. ఇకపై రాష్ట్ర అతిథులకు జ్ఞాపికలుగా మన హస్త కళాకారుల కళాకృతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. తద్వారా రాష్ట్ర కళాసంపదకు ప్రాచుర్యం అందించడంతోపాటు హస్త కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఎంపిక చేసిన వాటితో గిఫ్ట్ హ్యాంపర్ సిద్ధం చేయించి వాటిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్ర, అందులో కళాకృతుల వివరాలతో కూడిన కార్డు ఉంచాలని పవన్ సూచించారు. అతిథుల గౌరవార్థం ఇచ్చే జ్ఞాపికలు, శాలువాలకు శాఖాపరంగా ఇచ్చే బడ్జెట్‌లో 40 శాతం మాత్రమే తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 60 శాతం సొంత సొమ్ముతో కళాకృతులతో కూడిన గిఫ్ట్ హ్యాంపర్స్ సిద్ధం చేయాలని పేషీ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రత్యేక మిషన్

సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి, స్థానికుల ప్రయోజనాలు కాపాడటానికి ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఏవీకే)లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో 'మిషన్' ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉత్పత్తి పెంచడానికి, ముడి సరుకు కోసం, సెయిల్‌లో విలీనం వంటి చర్యలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ పెద్దలు, ఎంపీలు, ఉక్కు శాఖ, ప్లాంట్ ఉన్నతాధికారులు కలిసి మిషన్‌ను ముందుకు తీసుకెళ్లాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేయకుండా, బ్లాస్ట్ ఫర్నేస్ తెరిపించకుండా కార్మికులు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. 'పెట్టుబడులు లేవు, అధికారుల జీతాల్లో 30శాతం కోతలు, ఒప్పంద కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వలేదు. ఉద్యోగుల వేతన ఒప్పంద సవరణ జరగలేదు. ఇవన్నీ దుర్మార్గపు చర్యల'ని విమర్శించారు. తక్షణమే రూ.15వేల కోట్ల రుణాన్ని కేంద్రం నుంచి తెచ్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్ష, కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం సీపీఎం పోరాడుతుందని శ్రీనివాసరావు హెచ్చరించారు.

లడ్డూ కల్తీ ఆరోపణలపై దర్యాప్తు

షర్మిల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఇది హిందువుల మనోభావాలకు సంబంధించిన అంశమని, దేశ విదేశాల్లో ఎంతో మంది భక్తులు ఆందోళనలో ఉన్నారన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇంత పెద్ద విషయాన్ని ఇంతకాలం ఎందుకు గోప్యంగా ఉంచి, ఇప్పుడే ఎందుకు బయట పెట్టారని ప్రశ్నించారు. జులై 23న నివేదిక ఇస్తే ఎందుకు దాచారని, చంద్రబాబు 100 రోజుల పాలన సమావేశంలో ఎందుకు చెప్పారని నిలదీశారు. 100 రోజుల పాలనపై ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారని, దీనిని గమనించే సమస్యను పక్కదారి పట్టించడానికే చెప్పారా... వైసీపీపై బురద జల్లుతున్నారా... అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని చంద్రబాబు ప్రభుత్వం తేలిగ్గా తీసుకున్నప్పటికీ... మేం వదిలిపెట్టేదీ లేదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు కేంద్రమంత్రి అమిత్‌షాకు లేఖ రాశామని, గవర్నరును కలుస్తామని చెప్పారు. శిశుపాలుడు 100 తప్పులను వేతికినట్లుగా చంద్రబాబు 100 రోజుల పాలన ఉందని ఎద్దేవా చేశారు. 100 రోజుల్లో అద్భుతాలు అని చెప్పి మోదీ డైరెక్షన్‌లో సినిమాను అట్టర్ ఫ్లాప్ చేశారన్నారు. తల్లికి వందనం కింద ఎంత మంది బిడ్డలు ఉంటే అందరికీ రూ.15వేలు ఇస్తామని అన్నారని, ఏడాది ముగిసినప్పటికీ ఇంతవరకు దానిపై స్పందన లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మంది పిల్లలు ఎదురు చూస్తున్నారని, మహాశక్తి కింద ఇస్తామని చెప్పిన నెలకు రూ.15 వందల పథకంపైనా స్పష్టత లేదన్నారు. మూడు సిలిండర్లు లేవు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చడం 100రోజుల విజయమేనా అని ఆమె ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ కాదనే నమ్మకం లేదని, వలంటీర్లు ఆందోళన చెందుతున్నారని, ఉచిత ఇసుక పథకంలో ఉచితం లేదన్నారు.

నేటి నుంచి మావోయిస్టుల వార్షికోత్సవాలు

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): సీపీఐ (మావోయిస్టు) 20వ వార్షికోత్సవాలను శనివారం నుంచి అక్టోబరు 20వ తేదీ వరకు డివిజన్ వ్యాప్తంగా నిర్వహించాలని కార్యదర్శి వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'ఆపరేషన్ కగార్'ను ఓడించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 20 సంవత్సరాలు. రెండు దశాబ్దాల కాలంలో శత్రువుల క్రూరమైన దాడుల్లో కష్ట, నష్టాలను ఎదుర్కొని పీడిత ప్రజల విముక్తి కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి ఎన్నో విజయాలు సాధించారు. ప్రజాస్వామిక విప్లవం కోసం వీరోచితంగా పోరాడుతున్న పీఎల్‌జీఏ కమాండర్, పార్టీ శ్రేణులు, యోధులు, జైల్లో మొక్కవోని దీక్షతో పోరాడుతున్న సహచరులకు, విప్లవ ప్రజానీకానికి, ప్రజాస్వామికవాదులకు, ప్రగతిశీలురకు డివిజన్ కమిటీ విప్లవాభివందనాలు తెలిపింది. మావోయిస్టు స్థాపనా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాలు, వీధుల్లో ప్రజా సమావేశాలు, పాటలు, నాటికలు, నృత్యాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని కమిటీ తెలిపింది. ప్రభుత్వాలు తలపెట్టిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యమై పోరాడుతూ పార్టీని, విప్లవోద్యమాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చింది. తెలంగాణలో మావోయిస్టు పార్టీ... శత్రువు అణిచివేతను ఎదుర్కొంటూ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాజకీయ ఉద్యమాలు చేపట్టి అహర్నిశలు కృషి చేసింది. ప్రభుత్వాలు సామ్రాజ్యవాదులతో చేసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొడుతూ ఉద్యమాలు చేపట్టింది. ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను చేపట్టింది. పౌరహక్కుల హననానికి, రాజ్య హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసింది. కార్పొరేట్ల అనుకూల ప్రాజెక్టులు, మైనింగ్‌లు హరిత హారం, అభయారణ్యం, పోడు భూముల జప్తునకు, ఆదివాసీల స్వయం ప్రతిపత్తి కోసం ప్రజా ఉద్యమాలకు, కార్మికుల, రైతులు, నిరుద్యోగుల, విద్యార్థుల, మహిళల సమస్యకు నాయకత్వం వహించిందని కమిటీ పేర్కొంది. బీజేపీ 2047 వరకు బ్రాహ్మణీయ హిందుత్వ రాజ్యాన్ని నిర్మించే లక్ష్యంతో సమాదాన్, సూరజ్ కుండ్ వ్యూహాత్మక పథకం ఆపరేషన్ కగార్ పేరుతో వేలాది సైనిక బలగాలను దించి దాడులు చేసింది. చాలా మందిని హత్య చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కగార్ దాడిలో సాగర్, మణిరాం, లక్ష్మన్, విజేందర్‌ను పొట్టన పెట్టుకున్నట్టు కమిటీ వివరించింది. అమర వీరులు ఆదర్శాలు, కమ్యూనిస్టు విలువలు స్ఫూర్తినిస్తాయన్నారు. సామ్రాజ్యవాద, దళారి నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యం కావాలని డివిజన్ కమిటీ పిలుపునిచ్చింది.

ప్రశ్నిస్తే కేసులు పెట్టారు : రమణ దీక్షితులు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: గత ప్రభుత్వం ఇబ్బంది పెట్టినందునే ఆలయానికి దూరంగా ఉన్నానని టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షతులు అన్నారు. లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వినియోగం దుమారం రేపడంతో ఆయన స్పందించారు. ఈ పరిణామం బాధాకరమన్నారు. కమీషన్ల కోసమే నాటి ఈఓ ధర్మారెడ్డి అర్హత లేని కంపెనీకి నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపణలున్నాయి. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ఎన్‌డీడీబీ నివేదికలో నిర్ధారణ అవ్వడంతో గత ఈవో దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని దీక్షితులు చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన ఘోరాలను సీఎం చంద్రబాబుకు వివరిస్తానని ఆయనన్నారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక అప్రజాస్వామికం: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - అమలాపురం: దేశంలో బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటుందని, ఒకే దేశం-ఒకే ఎన్నిక అనే పద్ధతిలో దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరగాలని మోదీ సర్కారు కోరుకుంటుందని. రాజ్యాంగంలో 18 సవరణలు జరిగితే తప్ప ఇది అమలు సాధ్యం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సమితి సమావేశం అమలాపురం ఎస్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఇటీవల మరణించిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ కర్నూలు జిల్లా నాయకుడు కాకాని చిన్న రామకృష్ణ, రాజమండ్రి జిల్లా సీపీఐ నాయకులు పడాల వీరభద్రరావు తదితరులకు సమావేశం సంతాపం ప్రకటించింది. ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ వేమగిరి శామ్యూల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డేగా ప్రభాకర్‌తోపాటు జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పాల్గొన్నారు. డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా ఉండాలని సూచించారు. పులివెందుల వైద్య కళాశాలలో సీట్ల సంఖ్య పెంచవద్దని ఎన్ఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు జిల్లాలో అన్ని శాఖాసమావేశాలు ఈనెలాఖరికి జరపాలని చెప్పారు. నియోజకవర్గ కార్యదర్శులు మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం శాఖా సమావేశాలు సెప్టెంబర్ 21, ముమ్మిడివరం 22న, రామచంద్రపురం 23న, కొత్తపేట 24న, అమలాపురం 25న జరుపుతామన్నారు. జిల్లాలో వరద నష్టంపై క్షేత్ర పరిశీలన చేసి నిజమైన వరద బాధితులకు సాయం అందేలా చూడాలని తీర్మానించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసు, ఏఐఎస్ఎఫ్ నేతలు రవికుమార్, శీలం వెంకటేశ్, కొండే రామకృష్ణ, సమితి సభ్యులు వి.శామ్యూల్, రమణ, మోక శ్రీను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెత్వానీ కేసులో కుక్కల విద్యాసాగర్ అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీకి సంబంధించిన కేసులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. జత్వానీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాల సాయంతో డెహ్రాడూన్‌లో ఉన్న విద్యాసాగర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల నుండి తప్పించుకునేందుకు విద్యాసాగర్ తన స్నేహితుడి మొబైల్ వినియోగించారు. అయినా సాంకేతికత సాయంతో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఫోర్జరీ పత్రాలతో తనపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో సీనియర్ ఐపీఎస్ అధికారుల పాత్ర కూడా ఉందని ఆమె పేర్కొన్నారు. జత్వానీ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసింది. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీగా పని చేసిన కాంతి రాణా టాటా, విశాల్ గన్నీలపై సస్పెన్షన్ వేటు వేసింది. అంతకుముందే ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఏసీపీ హనుమంతరావులను డీజీపీ సస్పెండ్ చేశారు. జత్వానీ గురువారమే హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి భావోద్వేగానికి గురయ్యారు. తనపై నమోదు చేసిన తప్పుడు కేసు ఎత్తివేయాలని, తనకు రక్షణ కల్పించాలని, తనను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

సంపాదకీయం

ముగిసీ ముగియని కోల్‌కతా వైద్యుల నిరసన

కోల్‌కతాలోని ఆర్.జి. కర్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో పని చేసే డాక్టర్లు 42 రోజులుగా కొనసాగిస్తున్న నిరసనను విరమించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ విరమణ తమ ఆందోళనకు ముగింపు కాదని జూనియర్ డాక్టర్లు తెలియజేశారు. అంటే వారి సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదనే అర్థం. తమ నిరసన విరమించి శనివారం నుంచి విధులు నిర్వహిస్తామని ఇంతకాలం ఆందోళన చేసిన జూనియర్ డాక్టర్లు చెప్పారు. ఆర్.జి.కర్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రి సెమినార్ హాలులో దాదాపు ఆరు వారాల కింద ఒక జూనియర్ డాక్టర్ మృతదేహం కనిపించింది. ఆమె (అభయ) మీద అత్యాచారం, ఆ తరవాత హత్య జరగడం రెండు ఆందోళనకర అంశాలకు అద్దం పడుతోంది. ఒకటి ఆసుపత్రులలో పని చేసే వైద్యులకే కాదు ఇతర వైద్య సిబ్బందికి కూడా తగిన భద్రత లేకపోవడం. రెండవది కొందరు మనుషుల్లో యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేకుండా అత్యాచారం చేసే తత్వం. అత్యాచారం చేసిన తరవాత తమ తప్పు ఎక్కడ బయటపడుతుందోనని భయపడి అత్యాచారానికి గురైన మహిళలను అంతమొందించే కిరాతక స్వభావం. ఇందులో ఏది దేనికన్నా హేయమైంది అన్న విచికిత్స అనవసరం. రెండూ ఘోరమైనవే. ఇలాంటి సందర్భాలలో జనాగ్రహం పెల్లుబుకడం సహజం. కోల్‌కతాలో సుదీర్ఘ కాలం జరిగింది అదే. జూనియర్ డాక్టర్లు తమకు భద్రత కల్పించాలని కోరుతూ సుదీర్ఘ కాలం నిరసనకు దిగారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కొద్ది రోజుల కింద స్వయంగా జోక్యం చేసుకున్నా సమస్య కొలిక్కి రాలేదు. చివరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చిన తరవాత నిరసనకు తెర పడింది. జూనియర్ డాక్టర్ల నిరసనలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ అత్యాచారం, హత్య జరిగిన వెంటనే కళాశాల ప్రిన్సిపల్ సందీప్ కుమార్ ఘోష్‌ను మొదట మరో చోటికి బదిలీ చేయడంతో జూనియర్ డాక్టర్ల ఆగ్రహం తీవ్ర స్థాయిలో భగ్గుమంది. చివరకు ఆయన వైద్యం చేయడానికి ఇచ్చే లైసెన్సును కూడా రద్దు చేశారు. ఒక మహిళా డాక్టర్ మీద అత్యాచారం, హత్యకు ఆ ప్రిన్సిపల్ ప్రత్యక్షంగా బాధ్యుడు కాకపోవచ్చు. కానీ ఆసుపత్రిలో పని చేసే వారి మీద ఇలాంటి హేయమైన దాడులకు పాల్పడకుండా తగిన ఏర్పాట్లు చేయకపోవడం కచ్చితంగా ఆయన నిష్క్రియా పరత్వమే. నిజానికి ఆయన ఈ సంఘటనకు నైతిక బాధ్యత తీసుకుని ఉంటే ఈ హేయమైన చర్య వివాదంగా మారేది కాదు. కానీ ఆయన ఆ పని చేయకపోవడానికి ఆయనలో నైతికత లోపించడమే కాక ఇతరేతర కారణాలు కూడా ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. తమ వారికి వైద్యులు సరైన చికిత్స చేయలేదని భావించిన రోగి తాలూకు వారు డాక్టర్ల మీద, ఆసుపత్రుల మీద దాడులు చేసిన సంఘటనలు లెక్కలేనన్ని ఉన్నాయి. అంటే ఆసుపత్రుల్లో చికిత్సలో లోపాలతో పాటు చికిత్స చేసే వారికి భద్రత కల్పించడంలోనూ విపరీతమైన లోపాలు ఉన్నట్టే. ఈ సమస్య ప్రభుత్వ ఆసుపత్రులలోనే ఎందుకు ఎక్కువగా తలెత్తుతోందో తెలియదు. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆసుపత్రి ప్రభుత్వ నిర్వహణలో ఉన్నదే. ఆ ఆసుపత్రిలో పని చేసే వైద్యురాలి మీద అత్యాచారం ఆ తరవాత హత్య జరిగిందని తెలిసిన తరవాత బెంగాల్‌లో, ముఖ్యంగా కోల్‌కతాలో ప్రభుత్వ ఆసుపత్రుల న్నింటిలో జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు.

సుదీర్ఘమైన ఆందోళన తరవాత బెంగాలు ప్రభుత్వం ఆసుపత్రుల సిబ్బందికి తగిన భద్రత కల్పించడానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళా పోలీసులను, ఇతర భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో భద్రతా ఏర్పాట్ల మీద తనిఖీకి ఏర్పాట్లు చేయిస్తామని అత్యవసర సమయంలో అధికారులకు తెలియజేయడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ ఏర్పాటు చేస్తామని అత్యవసర సమయంలో ఆపద నుంచి తప్పించుకోవడానికి గంట మోగించే ఏర్పాటూ చేస్తామని ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల, నర్సుల, ఇతర వైద్య సిబ్బందిని త్వరలో భర్తీ చేస్తామని విధి నిర్వహణ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తామని మరుగుదొడ్లు, మంచినీళ్ల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇవన్నీ తీసుకోవలసిన చర్యలే. కానీ మరుగుదొడ్లు, మంచినీళ్ల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందంటే ప్రభుత్వ ఆసుపత్రులలో సదుపాయాలు ఎంత హేయంగా ఉన్నాయో అర్థం అవుతోంది. ఇటీవలి వర్షాలు, వరదలవల్ల చాలా మంది అనారోగ్యం పాలయ్యారు. వారికి తక్షణ వైద్య సహాయం అందించవలసిందే. ఈ బాధ్యతను గుర్తించిన జూనియర్ డాక్టర్లు తమ నిరసనను విరమించుకున్నారు. కానీ శుక్రవారం బెంగాల్ ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం "శ్వాస్థ్య భవన్" నుంచి సీబీఐ ఆఫీసు దాకా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. తమ నిరసన మెరుగైన భద్రతా ఏర్పాట్ల కోసమే తప్ప సంఘాలు పెట్టుకునే ఆలోచన తమకు లేదని జూనియర్ డాక్టర్లు ప్రకటించడం ఒకింత ఆశ్చర్యకరమైందే. కార్మిక సంఘాల్లాంటివి ఏర్పాటు చేసుకోవడం ఏ లెక్కన చూసినా సంఘ వ్యతిరేక కార్యకలాపాల కిందకు రావు. పైగా ఉమ్మడిగా పోరాడడానికి సంఘాలు ఉంటే సమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చునన్న వాస్తవాన్ని జూనియర్ డాక్టర్లు గుర్తించక పోవడం ఆశ్చర్యమే. కార్మిక సంఘాల లాంటివి ఏర్పాటు చేసుకోవడం తమ స్థాయికి తగదని వారి భావనే అయితే అది కచ్చితంగా అహేతుకమైందే. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగం కూడా తడబడతాయి. ఆర్.జి.కర్ ఆసుపత్రి ఉదంతం తరవాత బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అత్యాచారాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించడానికి వీలుగా కేంద్రం తగిన చట్టాలు తీసుకురావాలని కోరడం విచిత్రం. మరణ శిక్షలు ఎక్కడా ఏ హేయమైన నేరాన్ని అయినా నిరోధించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ రంగంలో కానీ ప్రైవేటు రంగంలో కాని పని చేసే వారికి కనీస సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద, యాజమాన్యాల మీద ఉంది. ఈ కనీస బాధ్యతను నెరవేర్చకుండా మరణ శిక్ష విధించాలని కోరడం కఠినమైన శిక్షలతో నేరాలను అదుపు చేయవచ్చునన్న అమాయకత్వమే అవుతుంది. ఏమైనా జూనియర్ డాక్టర్లు తాత్కాలికంగా విరమించిన నిరసనను సంపూర్ణంగా ఉపసంహరించేట్టు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. తమ హక్కులకోసం, భద్రత కోసం పోరాడుతూనే అత్యవసర వైద్య సేవలు అందించడం తమ బాధ్యతగా ఏ స్థాయిలోని డాక్టర్లైనా గుర్తించాల్సిందే.

హర్యానాలో మహిళలు, రైతులు కీలకం

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో విజయంపై మహిళలు, రైతులు, నిరుద్యోగులు కీలకమవుతారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ ఉన్నప్పటికీ, మరికొన్ని చిన్న పార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి. అక్టోబరు 5 వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అలాగే ఒబిసిలు, దళితులపైన ఆయా రాజకీయ పార్టీలు కేంద్రీకరించి ప్రచారం నిర్వహిస్తున్నాయి. బీజేపీ పైన రైతులు ఆగ్రహంగా ఉన్నారు. పంటలకు కనీస మద్దతు ధరను ఇస్తామని రాతపూర్వకంగా నరేంద్రమోదీ హామీ ఇచ్చి ఉల్లంఘించడం అత్యధికంగా ఉండే జాట్‌లు (రైతులు) తిరిగి బీజేపీ అధికారంలోకి రావడానికి ఇష్టపడటం లేదని అంచనాలు వస్తున్నాయి. బీజేపీ దశాబ్ద కాలం నుంచి అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకొనేందుకు అనేక హామీలను గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికను సెప్టెంబరు 18 న విడుదల చేయగా, బీజేపీ ఆ మరుసటిరోజున 19 వ తేదీ విడుదల చేసింది. తమ వాగ్దానాలను తప్పక అమలు చేస్తామని వాగ్దానం చేస్తున్నాయి. బీజేపీ, కేంద్రంలోను, రాష్ట్రాలలో చేసిన కొన్ని వాగ్దానాలనే నెరవేర్చి తక్కిన వాటిని వదిలేస్తున్నారని ముఖ్యంగా రైతులు విమర్శిస్తున్నారు. అనేక వాగ్దానాలు చేసి ఆప్ పార్టీ ఢిల్లీ, పంజాబ్‌లలో గెలుపొందిందన్న అంశం చర్చకు వచ్చింది. రెండు నెలల క్రితం కేజ్రీవాల్ ఉచితంగా విద్యుత్ సరఫరా, వైద్య చికిత్స, విద్యను అందిస్తామని, ప్రతి మహిళకు నెలకు వేయి రూపాయలిస్తామని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వాగ్దానాలు చేశారు. జైలులో కేజ్రీవాల్ ఉన్నందున, ఆయన భార్య సునీత కేజ్రీవాల్ ఐదు వాగ్దానాలను ప్రకటించారు. కాంగ్రెస్, ఆప్‌లు కలిసి పోటీ చేయాలనుకున్నప్పటికీ పొత్తు కుదరకపోవడంలో ఎవరికి వారు పోటీ చేస్తున్నారు. సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడంతో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఇక హర్యానాలో కేజ్రీవాల్ ప్రచారానికి సిద్ధమయ్యారు.

ఇక కాంగ్రెస్ ప్రతి మహిళకు, రూ.2 వేలు ఇస్తామని వాగ్దానం చేసింది. 18 ఏళ్ళ 60 ఏళ్ల మధ్యగల వారికి ఇస్తారు. అలాగే సామాన్య ప్రజలకు కుటుంబానికి 300 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధం చేస్తామని కాంగ్రెస్ హామీ చేసింది. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మోసగించిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుల గణనను తప్పనిసరిగా చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ చేసిన వాగ్దానాల్లో ప్రముఖమైందే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఎన్నికల ప్రణాళికను రెండు లక్షల మందికి పర్మనెంట్ ఉద్యోగాలను కల్పిస్తామని కూడా కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఒబిసిలలో క్రిమిలేయరును ఆరు నుంచి పదిలక్షలకు పెంచుతామని ఖర్గే వాగ్దానం చేశారు. 24 పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు ఇస్తామని హామీ ఇచ్చింది. కేంద్రంలోని బీజేపీ ఉద్యోగ కల్పనలో ఘోరంగా విఫలమైన విషయాన్ని రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారు. జేజేపీ - ఎఎస్‌పి పార్టీలు దుష్యంత్‌చౌతాల నాయకత్వం పోటీ చేయనున్నాయి. రైతులకు రూ.25000 రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చాయి. స్కూళ్ల, కాలేజీల్లో, యూనివర్శిటీల్లో విద్యా బోధనల రిక్రూట్‌మెంట్ 50 శాతం మంది మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని దుష్యంత్‌సింగ్‌చౌతాల వాగ్దానం చేశారు. పార్టీలన్నీ అనేక వాగ్దానాలు చేసినప్పటికీ చివరకు గెలుపు ఎవరనేది అంచనాలు స్పష్టంగా రావడంలేదు.

ఐరాస తీర్మానంపై భారత్ తీరు హేయం

సురవరం సుధాకరరెడ్డి

భారత విదేశాంగ విధానం దారి తప్పినట్లు కనపడుతున్నది. ఈ వారంలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పలస్తినామీద ఒక ముఖ్యమైన తీర్మానం చర్చించి ఆమోదించారు. ఇజ్రాయిల్ తమ దాడులు తక్షణమే ఆపు చేయాలని పాలస్తీనా పైన గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ప్రకారం వారి భూభాగం వారికి వదిలిపెట్టాలని తీర్మానం ప్రతిపాదించారు. సహజంగా ఈ సమస్య పైన అమెరికా, గ్రేట్ బ్రిటన్ తదితర దేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. అత్యధిక మెజారిటీ దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. అయితే ఆశ్చర్యకరంగా భారతదేశం ఈ తీర్మానం పైన ఓటు వేయకుండా తటస్థంగా ఉండిపోయింది. పలస్తినా పైన భారతదేశం ఎప్పుడూ సానుకూలమైన విధానాన్ని అవలంబించింది.

భారతదేశం గతంలో అలీన విదేశాంగ విధానాన్ని అవలంబించింది. కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న జాతీయ ఉద్యమ దేశాలు అలీన విదేశాంగ విధానానికి మద్దతు పలికాయి. ఆనాటి భారత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, ఆయనతోపాటు ఈజిప్టు అధ్యక్షుడు, ఘనా అధ్యక్షుడు ఎన్కృమా, యుగోస్లావియా అధ్యక్షులు మార్షల్ టిటో, ఇండోనేసియా అధ్యక్షులు సుకర్నో ఇందులో ప్రసిద్ధి చెందిన నాయకులు. ఆనాటి ప్రపంచ పెట్టుబడిదారీ లేక సామ్రాజ్యవాద కూటమిగా ఒకవైపు, సోషలిస్ట్ దేశాల కూటమిగా మరొకవైపు పరస్పర విరుద్ధమైన కూటములుగా ఉండేవి. అప్పుడు నెహ్రూ చొరవతో ఈ రెండు కూటముల నుంచి దూరంగా మరొక కూటమి అలీన దేశాల కూటమి ఏర్పడింది. అలీన అంటే తటస్థం కాదు. ఆయా సమస్యలను బట్టి స్వతంత్ర విధానాలతో నిర్ణయం చేసుకునే విధానాన్ని అలీన విధానం అంటారు. విభిన్న సందర్భాలలో ఈ కూటమి దేశాలు సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రపంచాన్ని శాసించాలని సామ్రాజ్యవాద దేశాల ఆలోచనలు. అలీన దేశాలు నిరాకరించాయి. అలాగే తమ దేశాలలో ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేశాయి. ఆనాడు భారతదేశం విశ్వ గురువునని చెప్పుకోలేదు. ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్నామని చెప్పలేదు. పలస్తీనాకు సంబంధించి దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి భారత విధానం పలస్తీనాకు అనుకూలం. బ్రిటన్ ఇంగ్లీష్ వారికి, ఫ్రాన్స్ ఫ్రెంచ్ వారికి ఎలా చెందుతుందో అలాగే పలస్తీనా ఆ దేశ ప్రజలకు చెందుతుందని మహాత్మా గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారు. అలీన దేశాలు ఇదే రకమైన నిర్ణయాన్ని తీసుకున్నాయి. యూదులు కొన్ని వేల సంవత్సరాల క్రితం ఆనాటి ఆటవిక యుద్ధాలలో తాము పలస్తీనా నుంచి పారిపోయామని చెప్పుకుంటున్నారు. వారి ప్రధానమైన మత కేంద్రం జెరూసలేం కనుక, ఇది వాస్తవం అయి ఉంటుందని కొంతమంది భావిస్తున్నారు. యూదులు ప్రపంచమంతా ముఖ్యంగా యూరప్‌లో నివాసం ఏర్పరచుకున్నారు. వారు అనేక వృత్తుల్లో ఉన్నప్పటికీ వ్యాపారంలో ప్రధానంగా ఉండేవారు. పారిశ్రామికీకరణ కారణంగా వారి వ్యాపారాలు దెబ్బతింటే వారు వడ్డీ వ్యాపారులుగా మారారు. అందులో కొందరు చాలా ఎక్కువ వడ్డీలు వసూలు చేస్తూ క్రూరంగా ప్రవర్తించేవారు. ప్రజలలో ఎక్కువ వడ్డీ వసూలు చేసేవారి మీద సహజంగా వ్యతిరేకత ఉంటుంది. వారు సంపద కూడపెట్టుకోవటం స్థానిక ప్రజలకు రుచించలేదు. దీనిని ఆసరాగా తీసుకొని జర్మనీలో హిట్లర్ యూదు వ్యతిరేక వాతావరణం రెచ్చగొట్టాడు. హిట్లర్ నాయకత్వం కింద యూదుల ఊచకోత సాగింది. లక్షలాది మంది యూదులను హత్య చేశారు. కమ్యూనిస్టులు, కార్మిక సంఘాల నాయకులు, మేధావులు హత్యకు గురయ్యారు. ఇది ఫాసిస్టు విధానం.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూదులు తమకు ఒక సొంత దేశం కావాలని సామ్రాజ్యవాద దేశాల మీద ఒత్తిడి పెట్టారు. వాస్తవానికి చాలా తక్కువ జనాభా, ఎక్కువ వైశాల్యం ఉన్న దేశాలు కొన్ని ఉన్నప్పటికీ ఆనాడు బ్రిటిష్ వలసగా ఉన్న పలస్తీనాను వారు కోరుకున్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు, ఆనాడు పాలస్తీనాను ఇజ్రాయిల్‌కు మెజారిటీ భూభాగం ఇచ్చేట్లు సామ్రాజ్యవాద దేశాలు నిర్ణయం చేశాయి. ఐక్యరాజ్యసమితి మెజారిటీ భూభాగం ఇజ్రాయిలీలకు, 40 శాతం భూభాగం పలస్తీనా ప్రజలకు పంచుతూ తీర్మానం చేసింది. ఇది చాలా అన్యాయమైన నిర్ణయం. యూదులు ఈ తీర్మానాన్ని అంగీకరించలేదు. సహజంగా పలస్తీనియన్లు దీనిని వ్యతిరేకించారు. యూదులు మొత్తం దేశం తమకే చెందాలని ఆనాటి నుంచి పలస్తీనా ప్రజల మీద తీవ్రమైన దాడులు చేస్తున్నారు. యూదులు పలస్తీనా పేరు మార్చి ఇజ్రాయిల్ పేరు పెట్టుకున్నారు.

సూయజ్ కాలువ జాతీయాకరణ తర్వాత అరబ్బు దేశాలకు పక్కలో బల్లెం లాగా ఇజ్రాయిల్‌ను సామ్రాజ్యవాదులు సృష్టించారు. ఆర్థిక, ఆయుధ సహాయం చేస్తున్నారు. అమెరికాలో యూదులు కొద్దిమంది ఉన్నప్పటికీ వారు అనేక కార్పొరేట్లకు అధిపతులు. రిపబ్లికన్ డెమోక్రటిక్ పార్టీలకు వారు వందల కోట్ల విరాళాలు ఇస్తారు. ప్రస్తుతం గత అక్టోబర్ 7వ తేదీ నుంచి ఇజ్రాయిల్ పలస్తీనా మీద నిరంతర దాడులు చేస్తున్నది. దాదాపు 40-42 వేలమంది చనిపోయారు. అందులో మహిళలు, పిల్లలు మూడు వంతులు ఉన్నారు. జర్నలిస్టులు మరణించారు. అంతర్జాతీయ సహాయం అందించడానికి వచ్చిన హెల్త్ వర్కర్లు వందలాదిమంది చనిపోయారు. 70 వేల మందికి పైగా గాయపడ్డారు. కొన్ని వేలమంది ఇజ్రాయిల్ జైళ్లల్లో ఉన్నారు. ప్రస్తుతం పలస్తీనా ప్రజలు 10% భూభాగంలో ఉంటున్నారు. అక్కడ కూడా నిరంతర దాడులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాడులు ఆపండి అనే తీర్మానానికి భారతదేశం ఎందుకు మద్దతు ఇవ్వట్లేదు అనేది ఒక పెద్ద ప్రశ్న. మానవతా దృక్పథంలో కూడా ఇది అన్యాయం. ఒక పక్క రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం ఆపాలని చెప్పిన మన ప్రధాని, ఇజ్రాయిల్ దాడులు ఆపాలని ఎందుకు అడగటం లేదు. ఇది అమెరికాకు ఆగ్రహం తెప్పిస్తుందని భావిస్తున్నారా లేక పలస్తీనాలో ముస్లిం ప్రజలు ఉన్నారన్న అభిప్రాయంతోనా.

విదేశాంగ విధానానికి స్పష్టత ఉండాలి. అమెరికాతో, రష్యాతో ఉక్రెయిన్ లౌక్యంగా ఏకకాలంలో సంబంధాలు ఒకే లాగా ఉండటం సాధ్యం కాదు. భారతదేశం చుట్టూ ఉన్న ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలు బాగాలేవు. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, మాల్దీవులు, నేపాల్ ఇవన్నీ భారత్ పట్ల అసంతృప్తిగా ఉన్నాయి. కొందరు వ్యతిరేకంగా ఉన్నారు. సరిహద్దు వివాదం వల్ల చైనాతో తీవ్రమైన వైరుధ్యం, కొన్ని సందర్భాలలో ఘర్షణలు సాగుతున్నాయి. ఈ పరిస్థితి భారత విదేశాంగ విధాన ఘోర వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. గతంలో భారత విదేశాంగ విధానం దేశంలో అన్ని పార్టీలు అంగీకరించిన జాతీయ విధానంగా ఉండేది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది పూర్తిగా మారింది. ఈ వైఫల్యాన్ని పునః పరిశీలించుకోవాలి. స్వతంత్ర అలీన విదేశాంగ విధానం పునరుద్ధరించుకోవాలి. దీనికి రాజకీయ సాహసం కావాలి.

సీపీఐ పూర్వ ప్రధానకార్యదర్శి

పీడిస్తున్న ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు

ఎం కోటేశ్వరరావు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకోవాలని అడిగిన పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ పెట్టిన షరతేమిటో తెలుసా? వర్తమాన తరుణం నుంచి 37 నెలల రుణవాయిదాల కాలంలో 2026 జూన్ నాటికి క్రమంగా వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరల ఎత్తివేతను అమలు జరపాలంది. అక్కడి ఐదు రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని పాటించాలని చెప్పింది. ఇలాంటి షరతులనే మనకూ ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ పెట్టాయి. రైతాంగానికి భయపడి కాంగ్రెస్ పాలకులు వాటిని అమలు జరిపేందుకు సాహసించలేదు. తాయత్తు కట్టుకొని జై భజరంగ భళీ అంటూ నరేంద్రమోడీ మూడు సాగు చట్టాల రూపంలో వాటిని రుద్దేందుకు చూశారు. ఫలితాన్ని, పర్యవసానాలను అనుభవించటం చూస్తున్నాము. దివాలా స్థితిలో ఉన్న పాకిస్థాన్ ఆదుకొనేందుకు అమెరికా పైరవీతో ఐఎంఎఫ్ 700 కోట్ల డాలర్ల సాయం అందించేందుకు అంగీకరించింది. దానికి గాను ఒక షరతు పెట్టింది. తమ అప్పుతీరాలంటే రైతులతో సహా ఎవరికీ రాయితీలు, సబ్సిడీలు ఇవ్వకుండా "పొదుపు" చేయాలంది. దానికి ప్రభుత్వ ఖర్చు తగ్గించాలన్నది. కావాలంటే ప్రభుత్వం తన అవసరాలకు మార్కెట్ ధరలకు కొనుగోలు చేసి అదే ధరలకు విక్రయించాలి తప్ప సబ్సిడీలు కుదరవంది. ఐఎంఎఫ్ షరతు అమల్లోకి వస్తే కనీస మద్దతు ధరలూ ఉండవు, ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన బాధ్యతా ఉండదు. పొదుపు పాటింపులో భాగంగా ఎరువులు, విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పాక్ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం గోధుమల సేకరణ నిలిపివేయటంతో బహిరంగ మార్కెట్‌లో 40శాతం ధరలు పడిపోయాయి. తరువాత వంతు చెరకు, పత్తి ధర ప్రకటన విధాన రద్దు అంటున్నారు. వినియోగదారులకు ఇస్తున్న గాస్ సబ్సిడీ తదితరాలకు దశలవారీ కోత పెడతారు. ఇది పాకిస్థాన్‌కే తప్ప సురక్షితమైన హస్తాలు ఉన్న నరేంద్ర మోదీ ఉన్నంత వరకు భారత్‌కు వర్తించదు అని ఎవరైనా అనుకుంటే చేసేదేమీ లేదు. గతంలో 1990దశకంలో తప్ప తరువాత కాలంలో మనదేశం ఐఎంఎఫ్ నుంచి అప్పులు తీసుకోలేదు. ప్రపంచ బ్యాంకు నుంచి వివిధ పథకాలకు ప్రాజెక్టు రుణాలు తీసుకుంటున్నాం. కుడికన్ను ఎడమ కన్ను తేడా తప్ప రెండు సంస్థల నుంచి తీసుకొనే రుణాలకు షరతులు షరా మామూలే. మన దేశంలో ఎరువుల ధరల నియంత్రణ విధానాన్ని ఎత్తివేసి పరిమితంగా కొన్నింటికి సబ్సిడీ విధానం అమలు చేస్తున్నారు. ఎగుమతులకు సబ్సిడీలు ఇవ్వకూడదు దిగుమతుల మీద పన్ను విధించకూడదన్న షరతులు కూడా ఐఎంఎఫ్ విధించింది. మన దేశం కూడా చేస్తున్నది అదే. చిత్రం ఏమిటంటే మన పాలకులు పాకిస్తాన్‌తో కొట్లాడినట్లు జనం ముందు ఫోజు పెడతారు. ఇద్దరిని ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ పిలిపించినపుడు వాటి ముందు చెప్పినట్లే చేస్తాం జీ హుజూర్ అంటూ చేతులు కట్టుకొని నిలబడటం తప్ప వ్యతిరేకించే ధైర్యం లేదు.

అన్ని అవకాశాలూ మూసుకుపోయిన తరువాతనే ఏ దేశమైనా ఐఎంఎఫ్ వద్దకు అప్పుకోసం వెళుతుంది. ఒకసారి తీసుకుంటే దాని రుణ ఊబిలో చిక్కుకున్నట్లే. పాత అప్పులు తీసుకొనేందుకు కొత్త రుణాలు తీసుకోవాల్సిందే. రుణాలు తీసుకున్న దేశాల మీద సర్‌ఛార్జీలు విధించి జలగలా పీల్చుతుంది. ఈ విధానం మీద తీవ్ర విమర్శలు తలెత్తటంతో సర్‌ఛార్జీల రూపంలో వచ్చిన రాబడిని రాయితీలతో కూడిన రుణాలు ఇవ్వటానికి వినియోగిస్తామని చెబుతోంది. ఇది మోసం తప్ప మరొకటి కాదు. తీసుకున్న రుణాల మీద వడ్డీ, సేవారుసుముల మీద అదనపు వసూలునే సర్‌ఛార్జి అంటారు. జనం భాషలో చక్రవడ్డీ. రుణాలు ఎక్కువగా తీసుకోకుండా దేశాలను నిరోధించేందుకే వాటికే విధిస్తున్నామని వితండవాదం చేస్తోంది. ఇబ్బందుల్లో ఉన్న దేశాలను ఉద్ధరించటానికే తాము రుణాలు ఇస్తున్నామని ఐఎంఎఫ్ చెబుతోంది. అదే నిజమైతే ఇప్పటికి 24సార్లు రుణం తీసుకున్న పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడేమిటి ? దాన్ని ఉద్ధరించిందీ లేదు, మరోసారి అప్పుకు రాకుండా చూసిందీ లేదు. ఐఎంఎఫ్‌కు చక్రవడ్డీలు చెల్లిస్తున్న ఐదు దేశాల్లో అదొకటిగా మారింది. పాకిస్థాన్ జీడీపీలో 70శాతం మేరకు అప్పులున్నాయి. ప్రభుత్వ ఆదాయంలో 50 నుంచి 60శాతం అసలు, వడ్డీల చెల్లింపులకే పోతోంది. మన ప్రభుత్వ రుణ భారం కూడా వంద శాతానికి చేరనుందని ఐఎంఎఫ్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. రానున్న ఐదు సంవత్సరాల్లో 22 దేశాల నుంచి ఐఎంఎఫ్ అదనపుబాదుడు 980 కోట్ల డాలర్లు ఉంటుందని, వాటిలో 2024 నుంచి 2033 వరకు ఉక్రెయిన్ 290 కోట్ల డాలర్ల మేర చెల్లించనుందని తేలింది. ధనిక దేశాల మీద ఆధారపడకుండా సొంతంగా నిధులు సమకూర్చుకోవాలంటే అదనపు వసూలు తప్పదని సమర్థకులు చెబుతున్నారు. అంటే దివాలా స్థితిలో ఉన్న వాటి దగ్గర వసూలు చేసి ఆ మొత్తాన్నే తిరిగి వడ్డీలకు ఇస్తారన్నమాట, ఈ విధంగా కూడా ధనిక దేశాలకు ఐఎంఎఫ్ మేలు చేస్తున్నది.

ఇబ్బందుల్లో ఉన్న 22 దేశాల నుంచి అదనపు బాదుడు ద్వారా ఐఎంఎఫ్‌కు వస్తున్న ఆదాయం ఎక్కువగా ఉంది. అలాంటి దేశాలను రక్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ నిధి చివరికి చక్రవడ్డీ వ్యాపారిలా మారి పీక్కుతింటోంది. 2020లో అదనపు చెల్లింపు దేశాల సంఖ్య పది కాగా కరోనా దెబ్బతో కుదేలై ఐఎంఎఫ్ దగ్గరకు అప్పుకోసం వెళ్లిన మరో పన్నెండు దేశాలు వాటి సరసన చేరాయి. ఈ సంస్థ వడ్డీ రేటు ఒకటి నుంచి ఐదుశాతానికి పెరగ్గా, సర్‌ఛార్జి చెల్లించే దేశాలకు అది 7.8శాతంగా ఉంటోంది. అందువలన ఈ దేశాలు అప్పుల ఊబినుంచి బయటపడే అవకాశమే లేదని అనేక మంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఈ అప్పు, వడ్డీ చెల్లించటానికి ఆ దేశాల పాలకులు జనాన్ని పీక్కు తింటారు. ఈ క్రమంలో మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు అంతర్జాతీయ మానవహక్కుల పరిశీలన సంస్థ ఏడాది క్రితం " బుల్లెట్ గాయంపై బాండేజ్ " పేరుతో 131పేజీల నివేదికలో వెల్లడించింది. ఐఎంఎఫ్ షరతులు అనేక సంక్లిష్ట పరిస్థితులను సృష్టించటమేగాక అసమానతలను కూడా పెంచుతున్నాయని చెప్పింది.

2020 మార్చి నుంచి 2023 మార్చి నెల వరకు 110 కోట్ల జనాభా ఉన్న 38దేశాలకు ఇచ్చిన రుణాలను ఆ నివేదికలో విశ్లేషించారు. పొదుపు షరతులే అత్యధికంగా ఉన్నాయి. ప్రభుత్వ ఖర్చు తగ్గింపు, రాబడి పెరిగే కొద్దీ మధ్యతరగతి, ధనికులు చెల్లించాల్సిన పన్ను రేటు తగ్గింపు, తక్కువ ఆదాయం వచ్చేవారి మీద పన్ను పెంపు విధానాలను అది రుద్దుతున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా అనేక దేశాల్లో జనం ఆందోళనలకు దిగుతున్నారు. ఈ షరతుల వలన ఆయా దేశాల రుణ దామాషాలు తగ్గటం లేదని స్వయంగా ఆ సంస్థ నివేదికలోనే పేర్కొన్నారు. దాని 39 ప్రాజెక్టులను సమీక్షించగా 32లో ఏదో ఒక ఆదేశం లేదా షరతు మానవహక్కులను ఉల్లంఘించేదిగా ఉందని తేలింది. ఇరవై రెండింటిలో ప్రభుత్వ వేతన బిల్లు తగ్గించేందుకు వేతన స్తంభన, వేతన పరిమితి లేదా తగ్గింపు షరతులు ఉన్నాయి. ఇరవై మూడు ఉదంతాలల్లో వ్యాట్ పెంచాలనే ఆదేశాలున్నాయి. ఇరవై ప్రాజెక్టుల్లో ఇంధనం, విద్యుత్ సబ్సిడీల తగ్గింపు, సామాజిక భద్రతా పథకాల ఖర్చు తగ్గింపు వంటివి ఉన్నాయి. మన దేశంలో నరేంద్రమోదీ సర్కార్ పెట్రోలు, డీజిలు మీద పెద్ద మొత్తంలో సెస్‌ల పేరుతో వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే.విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాలపై ఖర్చు తగ్గించటం, ప్రభుత్వాలు ఆ రంగాల నుంచి వైదొలగటం లేదా నామమాత్రంగా ఉండాలన్నది ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు చెప్పే సలహాలు లేదా ఆ ముసుగులో ఆదేశాలు ఉంటాయి. ఈ రెండు సంస్థలను బ్రెట్టన్‌ఉడ్ కవలలు అంటారు. ఎందుకంటే ఒకే దగ్గర అవి రూపుదిద్దుకున్నాయి. నాణానికి బొమ్మ బొరుసు వంటివి. రెండూ వేర్వేరుగా ఉన్నప్పటికీ సమన్వయంతో పనిచేస్తాయి. దేశాల మీద ఆదేశాలను రుద్దుతాయి. వాటి దగ్గరకు వెళ్లక ముందు మన దేశంలో రోడ్లకు టోల్‌టాక్సు, సెస్‌లు, వినియోగదారుల రుసుములు వంటి భారాలు లేవు. పెట్రోలు, డీజిల్ మీద భారీగా ఒకవైపు పన్నులు సెస్‌ల వడ్డింపు, వాహనాలకు జీవితకాల పన్ను, మరోవైపు అవి రోడ్ల మీద తిరిగితే టోల్‌టాక్సు. దీన్నే గోడదెబ్బ-చెంపదెబ్బ అంటారు.

ఐఎంఎఫ్ విధానాలను అమలు జరిపిన జోర్డాన్ పరిస్థితిని మానవహక్కుల సంస్థ విశ్లేషించింది. 2011 నుంచి 2017 మధ్య అక్కడ వృద్ధాప్య పెన్షన్ల వంటి సామాజిక భద్రతా బడ్జెట్‌ను గణనీయంగా తగ్గించారు. ఇంధనం, రొట్టెల మీద ఉన్న సబ్సిడీలను(మనదేశంలో పెట్రోలు,డీజిలు, గ్యాస్ మాదిరి) ఎత్తేశారు. తద్వారా ఆరు సంవత్సరాల్లో 110 కోట్ల డాలర్లను పొదుపు చేశారు. కోటీ పది లక్షల మంది జనాభాకు కేవలం లక్షా ఇరవై వేల మందికి 2019లో ప్రపంచ బ్యాంకు సహకారంతో ఐఎంఎఫ్ పథకాల్లో నగదు బదిలీ విధానాన్ని ప్రవేశపెట్టారు. తమకూ వర్తింపచేయాలని కోరిన వారిని వేధించారు, అణచివేశారు. 2018 నుంచి 2022 కాలంలో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారు 15 నుంచి 24శాతానికి పెరిగారు. దరఖాస్తు చేసుకున్న అత్యధికులకు తిరస్కరించారు. కేంద్రం అనుమతి ఇవ్వని కారణంగా మన రెండు తెలుగు రాష్ట్రాల్లో గత పది సంవత్సరాలుగా కొత్తగా తెల్లరేషన్ కార్డుల జారీ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇదీ మానవహక్కుల ఉల్లంఘనకిందికే వస్తుంది.

బీజేపీని ప్రజలు క్షమించరు: తివారీ

న్యూఢిల్లీ: తిరుపతి ప్రసాదం లడ్డూల తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉపయోగిస్తున్నారనే వివాదంపై కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో పంపిణీ చేసే లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వాడుతున్నారని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి అయిన టీడీపీ ఆరోపిస్తోందని, ఇది దేశ ప్రజల విశ్వాసాలను బీజేపీ వమ్ము చేయడంగా పరిగణించాలని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీజేపీ, బీజేపీ సర్కార్‌లో టీడీపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్నందున ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వ్యాఖ్యానించారు. ఈ పాపంలో బీజేపీ పాత్ర ఉంటే దేశ ప్రజలు ఎన్నటికీ కాషాయ పార్టీని క్షమించరని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో దేశభక్తి చచ్చిపోయింది

మహాత్మా గాంధీతో సంబంధమున్న పార్టీ కాదు

ప్రధాని మోదీ తీవ్ర వ్యాఖ్యలు

వార్ధా: కాంగ్రెస్ పార్టీని తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్‌నక్సల్స్ నడుపుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఇప్పుడు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ, గతంలో మహాత్మాగాంధీతో సంబంధమున్న పార్టీ కాదన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మహారాష్ట్రలోని వార్ధాలో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన ప్రధాని ఈ మేరకు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నేతలు విదేశీ పర్యటన సందర్భంగా దేశ వ్యతిరేక అజెండాపై మాట్లాడుతుంటారంటూ రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ పార్టీలో విద్వేషం అనే దెయ్యం ప్రవేశించింది. అందుకే కాంగ్రెస్ పార్టీలో దేశభక్తి అనే ఆత్మ తుది శ్వాస విడిచింది. ఇప్పటి కాంగ్రెస్ పార్టీ గణపతి పూజను కూడా ద్వేషిస్తోంది. స్వాతంత్ర్య పోరాటంలో లోకమాన్య తిలక్ నేతృత్వంలో గణపతి వేడుకలు దేశ ఐక్యతా ఉత్సవాలుగా మారాయి. గణపతి వేడుకల్లో అన్నివర్గాల ప్రజలు పాల్గొనేవారు. అందుకే కాంగ్రెస్ పార్టీ గణపతి పూజ పట్ల వ్యతిరేక భావంతో ఉంది. నేను గణేశ్ పూజ కార్యక్రమానికి వెళ్లా, కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయం నిద్ర లేచింది. గణేశ్ పూజను కూడా వ్యతిరేకించటం మొదలుపెట్టింది. బుజ్జగింపు రాజకీయాల కోసం ఏమైనా చేస్తోంది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం గణపతి బప్పాను కూడా కటకటాల వెనక్కి పంపింది. గణపతికి జరిగిన ఈ అవమానాన్ని చూసి దేశం మొత్తం ఉలిక్కిపడింది. కానీ ఈ విషయంపై పార్టీ మిత్రపక్షాలు మాత్రం మౌనంగా ఉండటం ఆశ్చర్యంగా ఉంది. కాంగ్రెస్ చేసిన ఈ పాపాలకు మనం ఏకమై సమాధానం చెప్పాలి' మోదీ అన్నారు. రాజకీయాలు, అవినీతి కోసమే కాంగ్రెస్ రైతులను ఉపయోగించుకుందని మోదీ ఆరోపించారు. 'తెలంగాణలో రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చి రైతులను తిప్పించుకుంటోంది. కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం, నిజాయతీ లేకపోవడం. మహారాష్ట్ర ప్రజలు ఆ పార్టీ పట్ల జాగ్రత్త వహించి మరోసారి అవకాశం ఇవ్వకుండా చేయాలి. గత ప్రభుత్వం విశ్వకర్మ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ప్రజలను ఎదగనివ్వలేదు. వెనుబడిన వర్గాలు, దళితులపై కాంగ్రెస్‌కు ఉన్న ప్రతికూల ఆలోచనలను ప్రభుత్వ వ్యవస్థ నుంచి తొలగించాం. ఇప్పుడు విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వారు కేవలం హస్త కళాకారులుగానే మిగిలిపోకుండా పారిశ్రామిక వేత్తలుగా మారాలన్నదే మా లక్ష్యం' అన్నారు. ఏడాది కాలంలో 18 వృత్తులకు చెందిన 20 లక్షల మందికి పైగా విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధి పొందారని, 8 లక్షల మందికి పైగా హస్తకళాకారులు నైపుణ్య శిక్షణ పొందారని మోదీ తెలిపారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, వేల సంవత్సరాల నాటి నైపుణ్యాలను ఉపయోగించుకునే రోడ్‌మ్యాప్ అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం విశ్వకర్మ పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒక పోస్టల్ స్టాంపును ప్రధాని విడుదల చేశారు.

చత్తీస్‌గఢ్‌లో రాహుల్‌పై మూడు ఎఫ్ఐఆర్‌ల నమోదు

రాయ్‌పూర్: ఇటీవల అమెరికా పర్యటనలో చేసిన వ్యాఖ్యల ద్వారా సిక్కుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారన్న ఆరోపణలపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై చత్తీస్‌గఢ్‌లోని వివిధ ప్రాంతాల్లో మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. రాజధాని రాయ్‌పూర్‌లోని సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో ఒకటి, బిలాస్‌పూర్ జిల్లాలోని బిలాస్‌పూర్ సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో మరొకటి గురువారం నమోదు కాగా... శుక్రవారం దుర్గ్ జిల్లాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో మరో ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు వారు తెలిపారు. బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని పోలీసు స్టేషన్‌లలో కూడా అధికార పార్టీ నాయకులు ఇలాంటి ఫిర్యాదులు సమర్పించారు. అన్ని కేసుల్లో రాహుల్ గాంధీపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 299 (మత విశ్వాసాలను అవమానించే ఉద్దేశం లేదా ఏదైనా వర్గానికి చెందిన మతపరమైన భావాలను రెచ్చగొట్టే ఉద్దేశపూర్వక హానికరమైన చర్యలు), 302 (పదాలు, శబ్దాలు, సంజ్ఞలు లేదా వస్తువుల ద్వారా ఉద్దేశపూర్వకంగా ఒకరి మతపరమైన భావాలను దెబ్బతీయడం) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సిక్కులు తలపాగా ('కడ') ధరించి భారతదేశంలోని గురుద్వారాకు వెళ్లడానికి అనుమతించబడతారా అని రాహుల్ వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఆయన ప్రకటన భారత సిక్కు సమాజపు మతపరమైన మనోభావాలను దెబ్బతీసిందని రాయ్‌పూర్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అమర్జీత్ సింగ్ ఛబ్రా పేర్కొన్నారు. 'ప్రపంచంలో, భారతదేశంలో కూడా సిక్కు సమాజం తలపాగా, కడాను ధరించి గురుద్వారాలను సందర్శించడం నిషేధించబడలేదు. ప్రధానమంత్రి కూడా తలపాగా ధరించి గురుద్వారాను సందర్శిస్తారు. రాహుల్ ప్రకటన శాంతి కోరుకునే సిక్కుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. ఇతర మతాలలో సిక్కుల పట్ల వివక్ష, శత్రుత్వాన్ని సృష్టించవచ్చునని ఆయన పేర్కొన్నారు. దుర్గ్ కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో బీజేపీ దుర్గ్ జిల్లా విభాగం చీఫ్ జితేంద్ర వర్మ రాహుల్‌పై కేసు పెట్టారు.

అధికారమిస్తే మళ్లీ 'దర్బార్ మూవ్': ఫరూక్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో తమను అధికారంలోకి తీసుకు వస్తే చారిత్రక 'దర్బార్ మూవ్'ను పునరుద్ధరిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. జమ్మూ, కశ్మీర్ మధ్య ఐక్యతను పాదుకొలిపేందుకు ఈ చర్య దోహదపడుతుందని చెప్పారు. జమ్మూ, కశ్మీర్‌ను రాజకీయంగా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా అనుసంధానించే వారధి 'దర్బార్ మూవ్' అని గుర్తు చేశారు. ఇందువల్ల రెండు ప్రాంతాల మధ్య ఎలాంటి విభజన ఉండదన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా అనుసరిస్తున్న 'దర్బార్ మూవ్' ప్రక్రియను పునరుద్ధరిస్తామని వాగ్దానం చేశారు. దర్బార్ మూవ్‌కు 152 ఏళ్ల చరిత్ర ఉంది. మహారాజా రణబీర్ సింగ్ పాలనలో 1872లో ఈ దర్బార్ మూవ్ ప్రారంభించారు. దీని ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసవి రాజధాని శ్రీనగర్‌కు మారతాయి. ఆ తర్వాత ఆరు నెలలు శీతాకాలం రాజధాని జమ్మూకు వస్తాయి. మే నుంచి అక్టోబర్ వరకూ సమ్మర్ సీజన్‌లో ప్రభుత్వ అధికారులు, యంత్రాగం అంతా శ్రీనగర్ నుంచి పనిచేస్తారు. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకూ వింటర్‌లో జమ్మూ నుంచి పనిచేస్తుంటారు. రెండు ప్రాంతాల (జమ్మూ, కశ్మీర్) మధ్య సమదృష్టితో వ్యవహరించడం ఈ చర్య ముఖ్య ఉద్దేశం. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఇది దోహదపడుతుందనే అభిప్రాయం బలంగా ఉంది. నిజానికి దర్బార్ మూవ్ విషయంపై ఎలాంటి వివాదం లేనప్పటికీ ఈ చర్య వల్ల రాష్ట్ర ఖజానాకు భారం ఎక్కువవుతోందనే వాదన ఉంది. ప్రభుత్వ ఆఫీసులు, రికార్డులు, సిబ్బందిని తరలించడం వల్ల ఏటా వందల కోట్లు ఖర్చవుతోందని కొంతమంది వాదన. కోవిడ్ మహమ్మారి సమయంలో ఖర్చు విషయంలో ఈ ఆందోళనలు మరింత పెరగడంతో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ విధానాన్ని 2021 జూన్ 30న సస్పెండ్ చేశారు. అయినప్పటికీ ఈ అంశం ఈ ప్రాంతంలో రాజకీయంగా, సాంస్కృతికపరంగా కీలకాంశంగానే కొనసాగుతోంది. సమ్మిళత వృద్ధి, ప్రాంతీయ సామరస్యతకు ఈ చర్య కీలకమనే అభిప్రాయం బలంగా నాటుకుంది.

పదేళ్లుగా నిద్రావస్థలో హర్యానా ప్రభుత్వం: ఖర్గే

న్యూఢిల్లీ: హర్యానాలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ఆ రాష్ట్ర ప్రజలకు హామీల వర్షం కురిపించాయి. తాజాగా శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హర్యానా ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి సంబంధించిన వీడియోను ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. హత్యల్లో, కిడ్నాపింగ్‌లో హర్యానా నెంబర్ వన్‌గా ఉంది. రైతులకు ఎంఎస్‌పి లభించలేదు. దానికిబదులుగా వారి కోసం నల్లచట్టాలు వచ్చాయి. హర్యానా ప్రభుత్వం గత పదేళ్లుగా నిద్రపోతోంది. ప్రజలారా మీరు మేల్కోండి... కాంగ్రెస్ లావో.. హర్యానా బచావో' అని ఖర్గే వీడియోలో పేర్కొన్నారు. కాగా, తాజాగా కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉచిత వైద్యం 25 లక్షల వరకు పెంచుతూ హామీ ఇచ్చింది. బీజేపీ 10 లక్షల వరకే ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు మేనిఫెస్టోలో తెలిపింది. మహిళలకు నెలకు రూ. రెండు వేలు అందజేస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే... బీజేపీ రూ. 2,100 ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చింది. యువతకు రెండు లక్షల ఉద్యోగాల్ని కల్పిస్తామని బీజేపీ ఆశపెట్టింది.

ఖర్గేను అవమానించడం తగదు: ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ప్రధాని మోదీ అగౌరవపరిచారని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా ఆరోపించారు. ఖర్గే రాసిన లేఖకు బదులివ్వకుండా మోదీ ఆయనను అవమానపరిచారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో ఉన్న గొప్ప సంప్రదాయాన్ని అత్యున్నత స్థాయిలో ఉన్న నాయకులు పాటించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'రాహుల్‌పై బీజేపీ నాయకులు చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన భద్రత గురించి ఆందోళన చెందిన ఖర్గే ప్రధానికి లేఖ రాశారు. మోదీకి ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం, పెద్దలపై గౌరవం ఉంటే ఆయనే స్వయంగా ఈ లేఖకు సమాధానమిచ్చేవారు. కానీ అలాకాకుండా నడ్డా ద్వారా ఆయన లేఖ రాయించారు. అందులోనూ ఖర్గేను అవమానపరిచారు. 82 ఏళ్ల సీనియర్ నాయకుడిని అగౌరవపరచాల్సిన అవసరం ఏముంది? ప్రధాని తమ పదవికి ఉన్న స్థాయిని దృష్టిలోపెట్టుకొని సమాధానం ఇచ్చి ఉంటే ఆయనకు విలువ ఉండేది' అని ప్రియాంక మండిపడ్డారు.

ఇటీవల రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు, ఎన్డీఏ మిత్రపక్షాలు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మోదీకి లేఖ రాశారు. దీనిపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందిస్తూ గతంలో రాహుల్ ప్రధానిని ఇదేవిధంగా అవమానపరచలేదా అని ప్రశ్నించారు.

రాహుల్‌పై నిరసనకు ఒత్తిడి

అంబేద్కర్ మునిమనవడు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈనేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని బీజేపీ నేతలు తనపై ఒత్తిడి తెచ్చారని అంబేద్కర్ మునిమనవడు రాజారత్నం పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో విడుదల చేశారు. 'రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపేందుకు, ధర్నాలు చేసేందుకు దేశంలోని అతిపెద్ద పార్టీ నన్ను సంప్రదించింది. రెండు రోజులుగా నాపై తీవ్రమైన ఒత్తిడిని తెచ్చింది. కానీ, నేను ఎలాంటి నిరసనలు తెలపాలని అనుకోవడం లేదు... చేయను కూడా. సమాజం కోసమే నేను సేవ చేస్తున్నాను. వారు మాత్రమే నాకు ఆదేశాలు ఇవ్వగలరు. నన్ను ఆదేశించే హక్కు బీజేపీకి లేదు. వారి ఆదేశాల మేరకు నేను నిరసనలు తెలపాల్సిన అవసరం లేదు. నేను రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మద్దతుదారుడిని కాదు. నాకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే. ఈ అంశంపై ఆయన్ను ఎందుకు వ్యతిరేకించాలి... ఏ అంశంపై ఆందోళనలు చేయాలనేది నా వ్యక్తిగత విషయం' అని ఆయన వీడియోలో పేర్కొన్నారు. కాగా, అమెరికా పర్యటనలో భాగంగా ఓ సమావేశంలో రాహుల్ గాంధీ రిజర్వేషన్ల అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉందన్నారు. దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాహుల్‌పై ఎన్డీఏ తీవ్ర విమర్శలు గుప్పించింది.

డీవీసీ తీరుతోనే బెంగాల్‌కు వరద

జార్ఖండ్ సరిహద్దు మూసివేత: మమత

కోల్‌కతా: జార్ఖండ్‌కు నీరు వదిలే క్రమంలో పశ్చిమ బెంగాల్‌లోని అనేక జిల్లాలను వరద నీరు ముంచెత్తడంతో దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) వ్యవహరించిన తీరుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. జార్ఖండ్‌ను రక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఈ విధంగా వ్యవహరించడం వల్లే వరద నీరు రాష్ట్రానికి పోటెత్తిందన్నారు. అవసరమైతే దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌తో తెగతెంపులు చేసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మమత స్పష్టం చేశారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల సరిహద్దులను మూడు రోజుల పాటు మూసి వేయాలని అధికారులను మమత ఆదేశించారు. ఇది కేవలం మానవ తప్పిదమని ఆమె పేర్కొన్నారు. డీవీసీ... డ్యామ్‌ల వద్ద పూడిక తీయడంలో దారుణంగా విఫలమైందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో వరద నీరు చుట్టు ముట్టిన హౌరా, మిడ్నాపూర్ జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మమత పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇదేమీ వర్షపు నీరు కాదన్నారు. డీవీసీ వదిలిన నీరు అని ఆమె వ్యంగ్యంగా అన్నారు. డీవీసీ వ్యవహార శైలి ఇదే విధంగా కొనసాగితే... వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని మమతా బెనర్జీ హెచ్చరించారు. డీవీసీ డ్యామ్‌ల్లో నీటి స్టోరేజ్ కేపాసిటీపై ఆ సంస్థకు అనేక ప్రశ్నలు సంధించారు. ఈ తరహా ఘటనలు గతంలో చోటుచేసుకోలేదని మమత గుర్తు చేశారు. డీవీసీ డ్యామ్‌ల నుంచి భారీగా నీరు వదల వద్దంటూ ఆ సంస్థ చైర్మన్‌కు తాను సూచనలు చేసిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ఈ ఏడాది 5.5 లక్షల క్యూసెక్కుల నీటిని డీవీసీ విడుదల చేసిందన్నారు. అందుకే బెంగాల్‌లో వరద పరిస్థితి ఏర్పడిందని మమతా బెనర్జీ చెప్పారు.

కేజ్రీవాల్‌కు ఢిల్లీలో వసతి

కేంద్రానికి ఆప్ డిమాండ్

న్యూఢిల్లీ: ఒక జాతీయ పార్టీ కన్వీనర్ హోదాలో ఉన్నందున అరవింద్ కేజ్రీవాల్‌కు వసతి కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ... ఈ విషయమై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పార్టీ తరఫున లేఖ రాయనుందని... ఒకట్రెండు రోజుల్లో కేజ్రీవాల్‌కు ప్రభుత్వం వసతి కల్పిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ వారం ప్రారంభంలో ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్...15 రోజుల్లో అధికారిక నివాసం నుండి బయటకు వెళ్లనున్నట్లు పార్టీ ఇంతకు ముందు ప్రకటించింది. దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా పనిచేసేందుకు కార్యాలయం, అధ్యక్షుడి వసతి పొందేందుకు ప్రతి జాతీయ పార్టీకి హక్కు ఉందని చద్దా పేర్కొన్నారు. 2022లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆప్ జాతీయ పార్టీగా అవతరించిందని ఆయన తెలిపారు. ఆ ఎన్నికల్లో కొన్ని సీట్లు, చెప్పుకోదగ్గ రీతిలో ఓట్ల శాతం లభించాయని ఆయన చెప్పారు. రెండేళ్ల పోరాటం, కోర్టు జోక్యంతో కేంద్రం ఆప్‌కి కార్యాలయాన్ని కేటాయించిందని ఆయన తెలిపారు. గత నెలలో డిడియు మార్గ్‌లోని ఆప్ పాత కార్యాలయం రవిశంకర్ శుక్లా లేన్‌లో ఉన్న కొత్త కార్యాలయానికి తరలించబడింది. రాజకీయంగా ఆలోచించకుండా ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ప్రభుత్వ వసతి కల్పించాలని తాను కేంద్రాన్ని కోరుతున్నానని... ఇది ఆమ్ ఆద్మీ పార్టీ హక్కు అని చద్దా అన్నారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బిఎస్‌పికి అధినేత్రి మాయావతి సహా దేశంలోని ఆరు జాతీయ పార్టీల అధ్యక్షులకు దేశ రాజధానిలో ప్రభుత్వ వసతి కల్పించారని ఆయన చెప్పారు. కేజ్రీవాల్‌కు ప్రభుత్వ వసతి కోసం ఆప్ న్యాయ పోరాటం చేయాల్సిన అవసరం రాదని చద్దా ఆశాభావం వ్యక్తం చేశారు. తన రాజీనామాను ఆమోదించిన తర్వాత కేజ్రీవాల్... ముఖ్యమంత్రిగా తనకు అందించిన అన్ని అధికారిక సౌకర్యాలను అతి త్వరలో వదులుకుంటారని చద్దా చెప్పారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. 'ఆయనకు ఆస్తి లేదు, సొంత ఇల్లు కూడా లేదు. జాతీయ పార్టీ కన్వీనర్‌గా ఆయన ప్రభుత్వ వసతికి అర్హులు. కేంద్రం ఆయనకు వసతి ఇవ్వాలి' అని చద్దా పేర్కొన్నారు.

రెండేళ్లలో నక్సలిజం అంతం: అమిత్ షా

న్యూఢిల్లీ: ఇటీవల చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టుల దాడులు పెరిగిపోతున్నాయని, 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హింసను వీడి లొంగిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. చత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ హింసాకాండలో 55 మంది బాధితులను ఉద్దేశించి శుక్రవారం ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించారని అమిత్‌షా పేర్కొన్నారు. మావోయిస్టులు ఒకప్పుడు పశుపతినాథ్ (నేపాల్) నుంచి తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటుచేయాలని భావించారని కానీ, మోదీ నేతృత్వంలో దాన్ని ధ్వంసం చేశామన్నారు. హింసను, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలని... లేకుంటే మావోయిస్టుల అంతానికి ఆల్- అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. చత్తీస్‌గఢ్‌లోని నాలుగు జిల్లాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిపిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయమైన విజయాన్ని సాధించాం న్నారు. రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో మావోయిస్టుల హింసాకాండ బాధితులకు హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ త్వరలో సంక్షేమ పథకాన్ని రూపొందిస్తుందన్నారు. ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణతో పాటు సంక్షేమ పథకాల ద్వారా బాధితులకు సహాయం అందిస్తామని షా వెల్లడించారు.

సుప్రీంకోర్టు యూట్యూబ్ ఛానెల్ హ్యాకింగ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు అధికారిక యూట్యూబ్ ఛానెల్ హ్యాకింగ్‌కు గురైంది. భారత సుప్రీంకోర్టు స్థానంలో అమెరికాలోని రిపుల్ ల్యాబ్స్‌కు చెందిన ఎక్స్‌ఆర్‌పీ అనే క్రిప్టో కరెన్సీ యాడ్స్ కనిపిస్తున్నాయి. గతంలో సుప్రీంకోర్టుకు సంబంధించిన వీడియోలు ఈ ఛానెల్‌లో కనిపించగా... ఇప్పుడు మొత్తం ఛానెల్లో క్రిప్టోకరెన్సీకి సంబంధించిన వీడియోలు దర్శనమిస్తున్నాయి. ఈ యూట్యూబ్ ఛానెల్లో రాజ్యాంగ ధర్మాసనాల్లో విచారణ జరుగుతున్న కేసుల విచారణ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ఇటీవల ఆర్‌జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో జరిగిన అత్యాచారం, హత్య కేసులో సూమోటో పిటిషన్‌పై విచారణ యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అయితే ఆ వీడియోలను హ్యాకర్లు ప్రైవేట్‌గా మార్చారు. ఇప్పుడు యూట్యూబ్‌లో సుప్రీంకోర్టు ఛానెల్ వీడియోను ఓపెన్ చేసినప్పుడు ఏమీ కనిపించడం లేదు. యూట్యూబ్‌కి వెళ్లి సుప్రీంకోర్టు అని రాస్తే ఛానెల్ చూపిస్తోంది. కానీ దానిపై క్లిక్ చేస్తే పేజీ అందుబాటులో లేదు. అందుకు క్షమించాలని వస్తుంది. వేరొకదాని కోసం వెతకడానికి ప్రయత్నించాలని సూచిస్తుంది. స్కామర్లు మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న ప్రసిద్ధ యూట్యూబర్‌లను టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో స్కామర్లు ఆ ఖాతాల నుంచి వారికి సంబంధించిన వీడియోలను ప్రమోట్ చేస్తున్నారు. ది వెర్జ్ కథనం ప్రకారం కొన్ని నెలలుగా ఈ స్కామ్ జరుగుతోంది. యూట్యూబ్ ఛానెల్ హ్యాకింగ్‌పై అప్రమత్తమైన సుప్రీంకోర్టు దర్యాప్తు చేస్తోందని అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే యూట్యూబ్ ఛానెల్ హ్యాకింగ్ గురించి మాత్రం సుప్రీంకోర్టు వర్గాలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. వెంటనే అప్రమత్తమైన సంబంధిత విభాగం సిబ్బంది యూట్యూబ్ ఛానెల్‌ను పునరుద్ధరించారు. హ్యాకింగ్ ఎవరు చేశారనే విషయం తెలియాల్సి ఉంది.

న్యాయమూర్తి వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వండి

కర్నాటక హైకోర్టుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: కర్నాటక హైకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా జడ్జి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సుప్రీంకోర్టు స్పందించింది. ఈ అంశంపై వెంటనే నివేదిక అందజేయాలని కర్నాటక హైకోర్టును సుప్రీంకోర్టు కోరింది. న్యాయ వ్యవస్థ హుందాతనాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అధ్యక్షతన నలుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. యజమానికి, కిరాయిదారుడికి సంబంధించిన వివాదంపై కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ వేదవేసాచార్ శ్రీశానంద మాట్లాడుతూ బెంగళూరులో ముస్లింల అత్యధిక ప్రాబల్యమున్న ప్రాంతాన్ని పాకిస్థాన్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే ఓ మహిళా న్యాయవాదితో ఆయన ద్వేషపూరిత వ్యాఖ చేశారు. జస్టిస్ శ్రీశానంద చేసిన ఈ వ్యాఖ్యల వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. దీనిపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని నలుగురు సభ్యులు జస్టిస్ ఎస్.కన్నన్, జస్టిస్ ఎస్ఆర్ గవాయి, జస్టిస్ ఎస్.కాంత్‌తో కూడిన ధర్మాసనం స్పందించింది. న్యాయస్థానంలోని ప్రొసిడింగ్స్ సోషల్ మీడియాలో సైతం వైరల్‌గా మారుతున్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయస్థానాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, వ్యాఖ్యలు న్యాయానికి కట్టుబడి ఉండే విధంగా ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయమూర్తి వ్యాఖ్యలపై నివేదిక సమర్పించాలని కర్నాటక హైకోర్టును కోరామని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు.

లాలూ ప్రసాద్‌కు చిక్కులు

న్యూఢిల్లీ: రైల్వే ఉద్యోగాల కోసం భూములు తీసుకున్నారనే కేసు విషయంలో లాలూ ప్రసాద్ యాదవ్‌కు మళ్లీ చిక్కులు మొదలయ్యాయి. ఈ కేసులో లాలూ యాదవ్‌ను విచారించేందుకు సీబీఐకి హోం మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. సీబీఐ ఛార్జిషీటుపై హోంశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో మిగిలిన నిందితులను కూడా ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి పొందడానికి సీబీఐ సిద్ధమైంది. దీంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు సీబీఐని ఆదేశించింది. మనీలాండరింగ్‌కు సంబంధించిన ల్యాండ్ ఫర్ జాబ్ కేసులో ఒకరోజు ముందే లాలూ కుటుంబానికి ఇబ్బందులు పెరిగాయి. ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ సహా ఇతర నిందితులకు సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 7న హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా తొలిసారిగా ఈ కేసులో కోర్టు నుంచి సమన్లు అందుకున్నారు. మనీలాండరింగ్‌కు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 15న ఢిల్లీ కోర్టులో జరగనుంది.

సామాజిక, రాజకీయ అంశాలపై అధ్యయనం

వీఈయూ 35వ మహాసభలో ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను కార్మిక సంఘాలు, యూనియన్లు నిరంతరం అధ్యయనం చేస్తూ... సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేయాల్సిన అవసరముందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ (వీఈయూ) 35వ మహాసభ శుక్రవారం స్థానిక చంద్రం బిల్డింగ్స్‌లో జరిగింది. సభకు విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షత వహించారు. ఓబులేసు మాట్లాడుతూ సామాజిక, రాజకీయ అంశాలపై అధ్యయనం చేస్తూ, తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలపై విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వాలు తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కొత్తకొత్త అంశాలను తీసుకొస్తున్నాయని చెప్పారు. ఇటీవల వరదలు వచ్చినప్పుడు ప్రకాశం బ్యారేజీలో బోట్లు కొట్టికొచ్చినట్లు, ముంబై సినీనటి జెత్వానీ తదితర అంశాలను తెరపైకి తీసుకురావడాన్ని ఉదాహరణగా చెప్పారు. తాజాగా కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తయిన సందర్భంగా తిరుపతి లడ్డూ అపవిత్రం అంటూ కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చిందని వివరించారు. అనవసరమైన విషయాలపై చర్చలు పెట్టి సమాజంలో గందరగోళ వాతావరణం తీసుకొస్తున్నారన్నారు. ఈ విషయాలను కార్మిక సంఘాలు, యూనియన్లు గుర్తించి తిప్పికొట్టాలన్నారు. మోదీ ప్రభుత్వ వినాశకర నిర్ణయాల అమలుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్ని విధాలా సహకరిస్తున్నారని విమర్శించారు. వరదల సందర్భంగా అహర్నిశలు శ్రమించిన మున్సిపల్ కార్మికులు, విద్యుత్ ఉద్యోగుల సేవలను ప్రధాన ప్రసార మాధ్యమాలు విస్మరించాయని, కేవలం ముఖ్యమంత్రి వరదల్లో తిరుగుతున్నారంటూ విపరీతంగా ప్రచారం చేశాయని గుర్తు చేశారు. విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ నూతన నాయకత్వానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినప్పటికీ... విశాలాంధ్ర పాత్ర గణనీయంగా ఉందన్నారు. ప్రతి పేజీలోనూ తన భావజాలాన్ని నింపుకుంటూ పాఠకులకు చేరువవుతోందన్నారు. ఇదే సమయంలో సంస్థ సిబ్బంది శ్రేయస్సే లక్ష్యంగా అహర్నిశలు యాజమాన్యం శ్రమిస్తోందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు అంకిత భావంతో పని చేయటం వల్లనే సంస్థ నడుస్తుందన్నారు. కరోనా విపత్తు సందర్భంగా ఉద్యోగులు యాజమాన్యానికి సహకారం అందించారని చెప్పారు. రాజకీయ కారణాలతో గత ప్రభుత్వం విశాలాంధ్ర పత్రికకు సహకారం ఇవ్వలేదన్నారు. సంస్థను ముందుకు నడిపించేందుకు పాతతరం నాయకత్వం వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కూన అజయ్‌బాబు మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్‌కు ఎంతో ఘనచరిత్ర ఉందని, నిరంతరం ఉద్యోగుల సమస్యలతోపాటు సామాజిక సేవలపైనా పనిచేయడం అభినందనీయమన్నారు. వరదల ముంపునకు గురైన విశాలాంధ్ర ఉద్యోగులు, సిబ్బందికి యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ తన మిత్రుల నుంచి సేకరించిన మొత్తంతో యూనియన్ తరఫున సాయమందిస్తున్నట్లు చెప్పారు. యూనియన్ కార్యదర్శి మురళీకృష్ణ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. విశాలాంధ్ర సిబ్బంది అభివృద్ధి కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. మోదుమూడి మురళీకృష్ణ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. వేదికపై ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి పి.మధుసూదనరావు ఆశీనులయ్యారు. అనంతరం ఇటీవల వరదలలో సర్వం కోల్పోయిన సిబ్బందికి గృహోపకరణాలు, దుప్పట్లు, వస్త్రాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ

మహాసభ 15 మందితో నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షుడుగా బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చావా రవి, మండేలా రామారావు, బి.మీనా, కార్యదర్శిగా ఎం.మురళీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, బాషా, వై.శాంతి, కమిటీ సభ్యులుగా విద్యాసాగర్, కలక రాజు, పి.మధుసూదనరావు, ఖదీర్, వన్నోజ్ ప్రకాష్ ఎన్నికయ్యారు.

‘లడ్డూ కల్తీ’ దోషులపై కఠిన చర్యలు

సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల మనోభావాలకు భంగం కలిగించిన వారిపై అత్యంత కఠినంగా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాద తయారీకి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో అపవిత్ర పదార్థాలు వాడినట్లు వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథితో పాటు ఉన్నతాధికారులతో తిరుమల అంశంపై చంద్రబాబు చర్చించారు. లడ్డూ తయారీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై తక్షణమే సమగ్ర నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈవోను సీఎం ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌లతో చర్చించి చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు. భక్తుల విశ్వాసాలను, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని చెప్పారు.

సమగ్ర విచారణ జరపాలి: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాద వివాదంపై సమగ్ర విచారణ జరపాలని... కల్తీ జరగడానికి కారకులైనవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాద తయారీలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందనే వార్త కలకలం రేపుతోందని, ఆ నెయ్యిలో అన్య పదార్థాలు కలిసినట్లుగా వస్తున్న వార్తలతో ఒక మతానికి సంబంధించిన భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదముందన్నారు. అందువల్ల ఎన్‌డీడీబీ రిపోర్టును బహిర్గతపరచి, వివాదంపై సమగ్రంగా విచారించాలని, కారకులను కఠినంగా శిక్షించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

అడుసుమిల్లి జయప్రకాశ్ మృతి

విశాలాంధ్ర-విజయవాడ: కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న మాజీ శాసన సభ్యులు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు అడుసుమిల్లి జయప్రకాశ్(72) హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో శుక్రవారం మరణించారు. ఆయన ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడ్డారు. కాకాని వెంకటరత్నం అనుచరుడిగా ఆయన ఆంధ్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడైన అడుసుమిల్లి జయప్రకాశ్ 1983లో ఆ పార్టీ తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు కొనసాగించకుండా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్న జయప్రకాశ్... ఎన్నో రాజకీయ వ్యాసాలు రాయడమే కాక, టీవీ ఇంటర్వ్యూల్లో వర్తమాన రాజకీయాలను విశ్లేషించి మంచి రాజకీయ వ్యాఖ్యాతగా గుర్తింపు పొందారు. అడుసుమిల్లి జయప్రకాశ్ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం విజయవాడలోని మొగల్రాజపురంలో జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

జల్లి విల్సన్ సంతాపం: అడుసుమిల్లి జయప్రకాశ్ మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. జయప్రకాశ్‌తో తనకు గల అనుబంధాన్ని ఓ ప్రకటనలో గుర్తుచేశారు.

జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను పోలీసులు ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు అక్టోబరు 3 వరకు (14 రోజులు) జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి న్యాయ పోరాటం చేస్తాం, కోర్టు నిజాలు తేలుస్తుందని జానీ మాస్టర్ భార్య అయేషా అలియాస్ సుమలత తెలిపారు. పోక్సో కేసు ఉన్నందున జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తామని జానీ మాస్టర్ తరఫు న్యాయవాది తెలిపారు. రిమాండ్ రిపోర్టు సిద్ధం చేస్తున్నారని వెల్లడించారు. జానీ మాస్టర్‌ను శుక్రవారం తెల్లవారుజామున గోవా నుంచి హైదరాబాద్ తీసుకొచ్చి రహస్య ప్రదేశంలో విచారించారు. హైదర్‌గూడలోని ఓ ఆస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం కోర్టులో అయన్ను హాజరుపరిచారు.

ఇదిలా ఉండగా... తనపై జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అతడి దగ్గర సహాయక కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన మైనర్ ఈనెల 15న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు జానీ మాస్టర్‌పై ఐపీసీ 376 (2) (ఎన్), 506, 323 సెక్షన్లతో పాటు పోక్సో కింద కేసు నమోదు చేశారు. కాగా, జానీ మాస్టర్‌తో పాటు ఆయన భార్య కూడా పలుమార్లు తనపై భౌతిక దాడికి పాల్పడిందంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో జానీ మాస్టర్ భార్యను నార్సింగి పోలీసులు స్టేషన్ లో విచారించారు. ఆమెను విచారిస్తున్న క్రమంలో ఆయన ఎక్కడున్నాడనే సమాచారాన్ని పోలీసులు రాబట్టారు. జానీ మాస్టర్ వద్ద నుంచి పాస్ పోర్ట్, సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలితో జరిపిన కాల్స్, వాట్సాప్ చాటింగ్, ఇతరత్రా ఆధారాలను సేకరించేందుకు సెల్‌ఫోన్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

ఇదిలా ఉండగా... ఓ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన బాధితురాలికి జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాతో పరిచయం ఏర్పడింది. 2019లో తన నృత్య బృందంలో సహాయ కొరియోగ్రాఫర్‌గా ఆమెను నియమించుకున్నాడు. ఓ డ్యాన్స్ ప్రాజెక్టు నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు ముంబై వెళ్లిన బాధితురాలిపై అక్కడి ఓ హోటల్‌లో జానీ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అప్పటికి ఆమె వయసు 17 ఏళ్లే. ఆ తర్వాత కూడా తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొంది.

నిరుద్యోగ యువతకు దగా

ఉద్యోగ, ఉపాధిపై శ్వేతపత్రం ప్రకటించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుమలై రామన్ ధ్వజం

విశాలాంధ్ర-విజయవాడ: వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఎంతమేర ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాయో సమాధానం చెప్పాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి మూడురోజుల వర్క్ షాప్ శుక్రవారం విజయవాడ హనుమాన్ పేటలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘ కార్యాలయంలో ప్రారంభమైంది. వర్క్‌షాప్ ప్రారంభ సూచికగా మొదటగా ఏఐవైఎఫ్ పతాకాన్ని ఏఐవైఎఫ్ మాజీ నాయకులు దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో తిరుమలై రామన్ మాట్లాడుతూ... వంద రోజుల పరిపాలనలో నిరుద్యోగ సమస్యపైగానీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై గాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఏదో సాధించామని ప్రకటనలు మాత్రం ఇస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ గత పదేళ్లుగా నిరుద్యోగులను మభ్యపెడుతుంటే ప్రతి సంవత్సరం 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత తనదంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలనలో నిరుద్యోగుల గురించి, నిరుద్యోగ సమస్య గురించి గానీ ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి గానీ కనీసం ఆలోచన చేయకపోవడం బాధాకరం అన్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి నమ్మబలికి మూడు నెలలైనా నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రెండు లక్షల 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి రాగానే భర్తీ చేస్తాం...నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. 100 రోజుల పాలనలో నిరుద్యోగులకు ఏం చేశారో శ్వేత పత్రం విడుదల చేసే ధైర్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందా అని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... సమాజంలో భౌతికవాదం, అభ్యుదయ మార్పుకి యువత నడుం బిగించాలని సూచించారు. వర్క్‌షాపులో నేర్చుకున్న అంశాలను ఆచరణలో చూపించాలని కోరారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో యువత భాగస్వాములు కావాలన్నారు. భగత్‌సింగ్, పూలే, పెరియార్ వంటి నేతల స్ఫూర్తితో ముందుగా సాగాలన్నారు. వర్క్ షాప్ సందర్భంగా ‘మూఢనమ్మకాలు- సామాజిక రుగ్మతలు’ అనే అంశంపై ప్రముఖ నాస్తిక వాది పెన్మెత్స సుబ్బరాజు, ‘సామ్రాజ్యవాద యుద్ధాలు- సమాజంపై ప్రభావం- యువత కర్తవ్యం’ అంశంపై ఐఎఫ్‌టీయూ నాయకులు పీ ప్రసాద్, ‘వ్యక్తి నిర్మాణం-సమాజ నాయకత్వం, రాజకీయాలు దేశ నిర్మాణం’ అనే అంశంపై అమర భగత్‌సింగ్ యువ నాయకుల వ్యక్తిత్వ వికాస కేంద్రం అధ్యాపకులు ఎంపీ తామస్‌లు శిక్షణ ఇచ్చారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి చంద్రనాయక్ ఆలపించిన విప్లవ గీతాలు అలరింపచేశాయి. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ.సుబ్బారావు, జి.నాగరాముడు, సంతోష్ కుమార్, కత్తి రవి, ఎం.యుగంధర్, సహాయ కార్యదర్శులు షేక్ సుభాని, వై.బాబి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లంకా గోవిందరాజులు, షేక్ సుభాని లతో పాటు 26 జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐడీ అధికారి విజయపాల్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సీఐడీ మాజీ అధికారి విజయపాల్ ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 24వ తేదీ ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం తెలిపింది. ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐడీ అధికారి విజయపాల్ పై గుంటూరు నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయపాల్ దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా టాటా

బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీపై అక్రమ కేసు వ్యవహారంలో సస్పెండ్ అయిన ఐపీఎస్ (మాజీ విజయవాడ సీపీ) కాంతిరాణా టాటా ముందస్తు బెయిల్ కావాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై సోమవారం విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది. జెత్వానీపై అక్రమ కేసు బనాయింపు, అరెస్టు, వేధింపుల వ్యవహారంలో సస్పెండ్ అయిన ముగ్గురు ఐపీఎస్ అధికారులను నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు న్యాయనిపుణులను సంప్రదిస్తున్నారు. న్యాయ సలహాలు అందిన తర్వాత ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు. జెత్వానీ కేసులో శుక్రవారం వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ ను అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో నిందితులుగా చేర్చే అవకాశం ఉండటంతో ఐపీఎస్ అధికారి కాంతీరాణా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

చెన్నై టెస్టులో పట్టు బిగించిన భారత్

- 308 పరుగుల ఆధిక్యం
- 149 పరుగులకే కుప్పకూలిన బంగ్లా

చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సరికి టీమిండియా 308 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రస్తుతం భారత్ ఇన్నింగ్స్‌లో 81-3 స్కోర్‌తో ఉంది. తొలి ఇన్నింగ్స్ ముగిసే సరికి 227 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 3 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ (5 పరుగులు), విరాట్ కోహ్లి (17 పరుగులు) మరోసారి నిరాశ పర్చారు. ఇక ఓపెనర్ యశస్వి జైస్వాల్ (10) కూడా తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరాడు. క్రీజులో శుభ్‌మన్ గిల్ (33), రిషభ్ పంత్ (12) ఉన్నారు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 149 పరుగులకే ఆలౌట్ అయింది. చెపాక్ పిచ్‌పై భారత బౌలర్లు చెలరేగిపోయారు. షకిబ్ అల్ హసన్ (32 పరుగులు) టాప్ స్కోరర్. మిరాజ్ (27 పరుగులు), లిట్టన్ దాస్ (22 పరుగులు), నజ్ముల్ షాంటో (20 పరుగులు) విఫలమవగా... మిగతా బ్యాటర్లు కూడా చేతులెత్తేశారు. ఇక భారత బౌలర్లలో బుమ్రా 4, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు పడగొట్టారు. దీంతో టీమిండియాకు తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల ఆధిక్యం లభించింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 339-6 తో రెండో రోజు ఆట ప్రారంభించిన టీమిండియా మరో 37 పరుగులకే చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. రవిచంద్రన్ అశ్విన్ (113 పరుగుల), రవీంద్ర జడేజా (86 పరుగులు)తో ఆకట్టుకున్నారు.

బుమ్రా 400 వికెట్ల మైలురాయి

ఈ టెస్టులో టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా అరుదైన మైలురాయి అందుకున్నాడు. బుమ్రా అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లలో కలిపి 400 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 36.5వ ఓవర్ వద్ద హసన్ అహ్మద్ వికెట్ తీయడం ద్వారా బుమ్రా ఈ ఫీట్ అందుకున్నాడు. కాగా, ఈ ఫీట్ సాధించిన 6వ భారత పేసర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ 687 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇక మొత్తంగా భారత్ తరఫున 400 వికెట్లు తీసిన 10వ బౌలర్‌గానూ బుమ్రా నిలిచాడు.

మోసం... దగా

చంద్రబాబు 100 రోజుల పాలనపై జగన్

తిరుమల లడ్డూపై దుష్ప్రచారమని విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వంద రోజుల చంద్రబాబు ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ లేదు... సెవెన్ లేదని, ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నమ్మించి... మోసగించిన చంద్రబాబు ప్రజల ముందు దోషిగా నిలబడ్డారన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జగన్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి మోసపూరిత హామీలిచ్చారని, అలవికాని హామీలతో నమ్మకద్రోహానికి పాల్పడ్డారని జగన్ నిందించారు. 100 రోజుల చంద్రబాబు పాలన తిరోగమన దిశలో సాగుతోందని విమర్శించారు. విద్యార్థులకు మూడు క్వార్టర్ల నుంచి విద్యాదీవెన, వసతి దీవెన అందడం లేదన్నారు. పిల్లలు ఫీజులు కట్టలేకపోతున్నారని, దీనివల్ల కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్కామ్‌లుగా మార్చారని, వాటిని ప్రైవేట్‌పరం చేసేందుకు అడుగులు పడుతున్నాయని జగన్ చెప్పారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతున్నారని సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ఒక సమస్య నుంచి దృష్టి మళ్లించడానికి మరో సమస్యను తెరపైకి తీసుకురావడం చంద్రబాబు నైజమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నుంచి దృష్టి మళ్లించడానికి ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. కోట్లాది భక్తుల మనోభావాలతో చంద్రబాబు ఆటలాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు 100 రోజుల పాలనా వైఫల్యాలు వెలుగులోకి రావడంతో తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడుతున్నారంటూ తమపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. సీఎం స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడడం ధర్మమేనా అని ప్రశ్నించారు. మెటీరియల్ ఎవరు సరఫరా చేసినా.. వారు పంపించిన నెయ్యి ట్యాంకర్‌తో పాటు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ల్యాబ్స్) సర్టిపై చేసిన క్వాలిటీ సర్టిఫికెట్ తీసుకురాలని జగన్ చెప్పారు. అలాంటప్పుడు కల్తీ నెయ్యి వాడారని, నాసి రకం సరుకులు వాడారని చెప్పడం అబద్ధం కాదా అని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో టీటీడీలో చాలా మార్పులు తీసుకొచ్చామని, టీటీడీలో ఉన్న ల్యాబ్‌ను సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్) సహకారంతో ఆధునీకరించామని చెప్పారు. ఈ అంశంపై ప్రధానికి, సీజేఐకి లేఖలు రాయనున్నట్లు జగన్ చెప్పారు.

సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రావణ్ కుమార్



విశాలాంధ్ర-గుంటూరు లీగల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరు న్యాయవాది మన్నవ శ్రావణ్ కుమార్ నియమితు లయ్యారు. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సీబీఐ కేసుల గురించి చర్చించేందుకు విశాఖపట్నం కార్యాలయానికి రావాల్సిందిగా ఆయనకు ఆదేశాలు అందాయి. పీపీగా శ్రావణ్ కుమార్ మూడేళ్లపాటు కొనసాగుతారు.

మార్పును కోరుతున్న హర్యానా

ఆప్ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్

చండీగఢ్: చండీగఢ్ రాష్ట్రం మార్పును కోరుకుంటోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. తన పార్టీ మద్దతు లేకుండా హర్యానాలో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు కాలేదని దీమాగా చెప్పారు. కేజ్రీవాల్ శుక్రవారం ఆప్ తరఫున ప్రచారం చేశారు. అక్టోబరు 5న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని హర్యానా ప్రజులు సాగనంపుతారని, మొత్తం రాష్ట్రం మార్పు కావాలంటోందని కేజ్రీవల్ ఉద్ఘాటించారు. హర్యానాలో తమకు చాలా సీట్లు వస్తాయని, గెలవబోయే మొదటి స్థానం జగద్రి అని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా బీజేపీని తమ గ్రామాలు, వీధుల్లోకి ప్రజలు రానివ్వరని స్పష్టమవుతోందని కేజ్రీవల్ అన్నారు. అవినీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మాదకద్రవ్యాల ముప్పు బీజేపీ పాలనలో పేట్రేగినట్లు ఆరోపించారు. మీకు బీజేపీ ఇచ్చింది ఏమిటి? అవినీతి, నిరుద్యోగం, దోవ్యోల్బణం... మీ పిల్లలకు డ్రగ్స్ తప్ప మరేమీ లేదు అని వ్యాఖ్యానించారు. తప్పుడు కేసు బనాయించి తనను ఐదు నెలలు అన్యాయంగా జైల్లో పెట్టారని బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సామాన్య ఖైదీలకు ఇచ్చే వెసులుబాట్లు కూడా తనకు కల్పించలేదన్నారు. ‘మా ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని బెదిరించారు. ఎమ్మెల్యేలు కాదు కదా ఒక్క కార్యకర్తను కూడా తమ వైపునకు తిప్పుకోలేకపోయారు. మాది నిజాయితీపరుల పార్టీ’ అని కేజ్రీవాల్ అన్నారు. జైలు నుంచి బయటకు వచ్చాక సీఎం పదవిలో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయలేదని, ప్రజలు తిరిగి ఎన్నుకుంటేనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠిస్తానని కేజ్రీవాల్ తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.